# ప్రజా తపన

prajathapana.com

News that matters




సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తీ ఈ సుగుణములతోజాజ్వల్యమానంగా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 69 గురువారం 27 ఏప్రిల్ 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-




## తమ్ముళ్లు, చెల్లెళ్లు అందరూ సత్యనాదెళ్లతో పోటీ పడాలి

**అనంతపురం**

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంటర్ తర్వాత చదువు మానేసే వారి సంఖ్య బాగా తగ్గిందని సీఎం జగన్ చెప్పారు. అంతకుముందు ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుకునే వారి సంఖ్య గతంలో 37 లక్షలుగా ఉంటే, తాము అధికారంలోకి వచ్చాక మార్పు చేసిన విధానాల వల్ల, ప్రభుత్వ కాలేజీలు, స్కూళ్లలో చదివేవారి సంఖ్య 40 లక్షలకు పైగా విద్యార్థులు చేరారని అన్నారు. ఇంజినీరింగ్, డిగ్రీ చదివే విద్యార్థులు కోర్సు చదివేటప్పుడే ఇంటర్న్‌షిప్ కచ్చితంగా చేయాలనే నిబంధన తీసుకొచ్చినట్లుగా చెప్పారు. జగనన్న వసతి దీవెన నిధుల విడుదల కార్యక్రమంలో భాగంగా.. బుధవారం (ఏప్రిల్ 26) అనంతపురం జిల్లా నార్పలలో ఏర్పాటు జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. అనంతరం దాదాపు 8 లక్షల మంది తల్లుల ఖాతాల్లోకి దాదాపు రూ.912 కోట్ల రూపాయలను నేరుగా జమ చేశారు." ఒక్క సత్యనాదెళ్ల ఈ జగనన్నకు సరిపోదు, నా తమ్ముళ్లు, చెల్లెళ్లు అందరూ సత్యా నాదెళ్లతో పోటీ పడాలి. అందుకే జగనన్న విదేశీ దీవెన అనే పథకం తీసుకొచ్చాం. టాప్ 50 యూనివర్సిటీల్లో కనుక సీట్ వస్తే దాదాపు కోటి 25 లక్షలకుపైగా ఫీజులు ప్రభుత్వమే భరిస్తుంది. మీరు చదవండి.. చదివించే బాధ్యత మా అన్నది. 'ఎడ్యుకేషన్ ఈజ్ నాలెడ్జ్' ఇది ఎప్పుడూ గుర్తు పెట్టుకోవాలి. మీ జగనన్న ఆలోచనలు ప్రపంచంలో మిమ్మల్ని లీడర్లను చేసేలా ఉన్నాయి. "పేదరిక సంకెళ్లను తెంచుకోవాలంటే అది చదువు అనే అస్త్రంతోనే సాధ్యమవుతుందని అన్నారు. చదువు అనేది ఓ కుటుంబ చరిత్రనే కాదని, ఓ సామాజిక వర్గాన్ని కూడా మారుస్తుందని అన్నారు. చదువుల కోసం ఏ ఒక్కరూ అప్పుల పాలయ్యే పరిస్థితి రాకూడదనే తాపత్రయంతోనే, ఈ నాలుగేళ్లలో నాణ్యమైన విద్య అందించే విధంగా మార్పులు చేశామని అన్నారు. విద్యా రంగంలో గొప్ప విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని సీఎం జగన్ చెప్పారు.

**చంద్రబాబు నరమాంస భక్షకుడు**

సీఎం జగన్ అనంతపురం పర్యటన

02

## ఛత్తీస్‌గఢ్ లో నక్సలైట్లు ఘాతుకం



**మందుపాతర పేలి10 మంది జవాన్లు, ఒక డ్రైవర్ మృతి**

**దంతెవాడ :**

ఛత్తీస్‌గఢ్ దంతెవాడ జిల్లా అరణ్‌పూర్‌లో నక్సలైట్లు ఘాతుకానికి పాల్పడ్డారు. మందుపాతర పేల్చి 10 మంది జవాన్లు, ఒక డ్రైవర్‌ను పొట్టనపెట్టుకున్నారు. మృతులంతా డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ జవాన్లు డీఆర్‌జీ జవాన్లు కూంబింగ్ ముగించుకుని మినీ బస్సులో వస్తుండగా నక్సలైట్లు మందుపాతర పేల్చారు. దీంతో మొత్తం 11 మంది చనిపోయారు. ఘటనా స్థలనికి పోలీస్ ఉన్నతాధికారులు చేరుకున్నారు. నక్సలైట్ల కోసం కూంబింగ్ మొదలుపెట్టారు.

ఈ ఘటనపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ బగేల్ స్పందించారు. పోలీసుల మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల్లో 10 మంది డీఆర్‌ఎఫ్ పోలీసులు , డ్రైవర్ ఉన్నారు. పోలీసులు కూంబింగ్‌కు వెళ్తున్న సమయంలో మావోయిస్టులు మెరుపుదాడికి దిగారు.'



## ఏపి లో పెద్దఎత్తున పోలీసు ఉన్నతాధికారుల బదిలీ

**అమరావతి:**

ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే ఏడాది ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో సీఎం జగన్ ప్రభుత్వం పెద్దఎత్తున పోలీసు ఉన్నతాధికారులను బదిలీ చేసింది. తాజాగా డీఎస్పీలకు సైతం స్థానచలనం కల్పించింది. ఏకంగా ఒకేసారి 70 మంది డీఎస్పీలు, ఏడుగురు ఐపీఎస్‌లను ట్రాన్స్‌ఫర్ చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఒకే చోట మూడేండ్లు పదవీకాలం పూర్తిచేసుకున్నఎస్పీలను బదిలీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. వీరిలో అమలాపురం డీఎస్పీ మాధవరెడ్డి, తాడిపత్రి డీఎస్పీ చైతన్య కూడా ఉన్నారు.

## సీబీఐ ఒక్క కోణంలోనే దర్యాప్తు చేస్తూ నన్ను ఇరికిస్తోంది

**ఎంపి వైఎస్ అవినాశ్ రెడ్డి**

**హైదరాబాద్ :**



'వివేకా కేసులో సునీతమ్మ మొదట సీబీఐకి ఇచ్చిన స్టేట్మెంట్‌లలో చాలా వ్యత్యాసం ఉంది. సునీతక్క సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలో పలు అనుమానాలున్నాయి. సీబీఐ ఒక్క కోణంలోనే దర్యాప్తు చేస్తూ నన్ను కుట్రపూరితంగా ఇరికిస్తోంది. వివేకా హత్య కేసును ఛేదించే దానికంటే నన్ను ఇరికించే దానికే సీబీఐ ప్రయత్నిస్తోంది. నేను రెండేళ్లుగా సీరియస్‌గా తీసుకోకపోవడమే ఇలా జరిగిందనీ భావిస్తున్నాను. ఒక ఎంపీ స్థాయి వ్యక్తికే ఇన్ని ఇబ్బందులు వస్తే.. సామాన్యుడి పరిస్దితి ఏమిటి..?. వివేక హత్య జరిగిన రోజు నేను జమ్మలమడుగు వెళ్తుతున్నాను. పులివెందుల రింగ్ రోడ్డుకు వెళ్ళిన తర్వాత శివప్రకాష్ రెడ్డి నుంచి నాకు ఫోన్ వచ్చింది. కానీ నేను ఆ రోజు ఇంట్లోనే ఉన్నట్లు చూపించి కేసులో ఇరికించే ప్రయత్నం చేసింది. నాతో పాటు ఆ రోజు జమ్మలమడుగుకు 20 మంది పైనే వస్తున్నారు. నా వెనుక వచ్చిన వారిని సీబీఐ ప్రశ్నంచినా విషయం బయట పడుతుంది. హత్య జరిగిన రోజు విలువైన పత్రాలు ఎత్తుకెళ్ళామని దస్తగిరి చెబుతున్నాడు.. కానీ దానిపై ఎందుకు చోరీ కేసు సెక్షన్లు పెట్టలేదు ఆవిధంగా ఎందుకు విచారించడం లేదు. లెటరు, సెల్ ఫోన్ సాయంత్రం వరకు ఎందుకు దాచి పెట్టారు..? ఆ కోణంలో వారిని ఎందుకు ప్రశ్నించరు..? దర్యాప్తు చేయరు..?. ఈ కేసులో నిజాలు బయటకు రావాలని కోరుకుంటున్నాను. ఈ కేసులో విషయంలో నేను ఏ తప్పు చేయలేదని చాలా ధీమాతో ఉన్నాను' అని అవినాష్ ఈసారి కొత్త లాజిక్‌లు, కొత్త కోణాలను బయటపెట్టారు. ఇప్పటి వరకూ ఈ కేసులో పలు విషయాలు చెప్పిన అవినాష్.. ఇప్పుడు కొత్త కోణాల గురించి చెప్పడం పలు అనుమానాలు తావిస్తోంది. రెండ్రోజులుగా సీబీఐ బృందం పులివెందులలోనే తిష్టవేసి ఈ కేసుకు సంబంధించి సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేస్తోంది. మరోవైపు రేపో.. మాపో అవినాష్‌ను అరెస్ట్ చేస్తారని కూడా వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆయన ఇలా

02

## జగన్ ప్రభుత్వం మైనారిటీలను మోసం చేసింది

**మైనారిటీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు**

**పల్నాడు :**

టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు బుధవారం పల్నాడు జిల్లాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా టీడీపీ నేత సుభాని అకాల మరణానికి సంతాపం తెలుపుతూ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి మసీదుకు రిజిస్ట్రేషన్ చేయించాలని, కరెంట్ బిల్లులో సబ్సిడీ ఇవ్వాలనే విషయాన్ని తప్పకుండా పరిశీలనలోకి తీసుకొని హామీ నెరవేరుస్తానన్నారు.

02



## ఆస్తి కోసమే అనుకుంటే చంపాల్సింది వివేకాని కాదు

**సునీతను- వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల కీలక వ్యాఖ్యలు**

**హైదరాబాద్ :**

తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారిన వైఎస్ వివేకా హత్య కేసు విచారణ కీలక దశకు చేరుకున్న తరుణంలో వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల స్పందించారు. వైఎస్ వివేకాపై వ్యక్తిగత ఆరోపణలు చేయడం దారుణమని ఆమె వ్యాఖ్యానించారు. తన చిన్నాన్న వివేకా ఆస్తులన్నీ సునీత పేరు మీదే ఉంచారని, అన్ని ఆస్తులు ఎప్పటి నుంచో

02



# ఏ యూ తెలుగు విభాగం & సమైక్యభారతి ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి

**ప్రజా తపన**

ఆంధ్రవిశ్వకళాపరిషత్,తెలుగు విభాగం మరియు సమైక్యభారతి సంయుక్త ఆధ్వర్యంలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి ని మే 7 తేదీన ఆదివారం సాయింత్రం 5 గంటలకు ఆర్కే బీచ్ పండిట్ జవహార్ లాల్ నెహ్రు విగ్రహాం ఎదురు స్వాతంత్ర్య సమరయోధుల మైదానం నందు నిర్వహిచే కార్యక్రమానికి సంబంధించిన గోడ ప్రతి ని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య పి వి జి డి ప్రసాదరెడ్డి ఆవిష్కరించారు. ఆవిష్కరణ కార్యక్రమం లో స్టీల్ అధారటీ ఆఫ్ ఇండియా ఇండిపెండెంట్ డైరెక్టర్ శ్రీ యస్ కాశీ విశ్వనాథరాజు,తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు ,సమక్యభారతి జాతీయ సమన్వయకర్త శ్రీ పి కన్నయ్య ,ఆహ్వాన సంఘం అధ్యక్షులు డా బూసి వెంకటస్వామి పాల్గొన్నారు.




అనంతరం ఆంధ్రవిశ్వకళాపరిషత్ ,తెలుగు విభాగం సమావేశమందిరంలో మీడియా సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా ఆహ్వాన సంఘం అధ్యక్షులు డా బూసి వెంకటస్వామి,సమైక్యభారతి జాతీయ సమన్వయకర్త శ్రీ కన్నయ్య మీడియా సమావేశంలో మాట్లాడుతూ విప్లవజ్యోతి,మన్యం వీరుడు,స్వాతంత్ర్య సమరయోధుడు,బ్రిటిష్ దాస్య శృంఖలాలను తెంచి మన్యం ప్రజలకేగాక యావత్ భారతావనికి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు ప్రసాదించాలని కలలుగని తన జీవితాన్నే త్యాగం చేసిన మహోనీయుడు అల్లూరి సీతారామరాజు అని అటువంటి మహోనీయుడిని ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం అతనిని పట్టిచ్చిన వారికి పదివేల రూపాయిలు ఇస్తామని ఆశచూపినా ప్రజలు లెక్కచేయలేదని ఆయన ఒకవ్యక్తిగా గాక శక్తి సమూహంగా ప్రజలను చెతన్యవంతంచేసి సామాజిక స్ధితిగతులను మార్చటానికి ప్రయత్నించారని తెలియజేసారు. అటువంటి గొప్ప వ్యక్తి కి ఆంధ్ర జాతి రుణపడి ఉందన్నారు.వారిని స్మరించుకోవడం అంటే మనలను మనం స్మరించుకోవటమేనన్నారు.వారి శత వర్ధంతి ని చేయటం తమ జన్మ సుకృతం గా భావిస్తున్నా మన్నారు, అల్లూరి వారికీ నివాళులు అర్పిస్తూ అయన శత వర్ధంతి సందర్భంగా మే 7 తేదీన గాంధీ పార్క్ శ్రీ విష్ణు అపార్ట్ మెంట్ జంక్షన్ దసపల్లా హిల్స్ వద్ద ఉదయం పది గంటలకు ఉచితవైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఈ కార్యక్రమానికిముఖ్య అతిథిగా స్టీల్ అధారటీ ఆఫ్ ఇండియా ఇండిపెండెంట్ డైరెక్టర్ శ్రీ యస్ కాశీ విశ్వనాథరాజు హాజరవుతున్నారన్నారు .అదే రోజు సాయింత్రం పండిట్ జవహార్ లాల్ నెహ్రు విగ్రహం ఏదురు ఉన్న స్వాతంత్ర్య సమరయోధుల మైదానం లో బహిరంగ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లుతెలిపారు .ఈ సమావేశానికి సభాధ్యక్షులుగా విజయనగరం సెంచూరియన్ యూనివర్శిటీ ఉపకులపతి ఆచార్య జి.యస్.యన్. రాజు, ముఖ్య అతిథిగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ రెక్టార్ ఆచార్య పి. వరప్రసాద్ మూర్తి, విశిష్ట అతిథులుగా ఆంధ్రవిశ్వ కళాపరిషత్,తెలుగు విభాగం శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు,డా? రాయల సుబ్బారావు, ఆచార్య జి. యోహన్ బాబు,గురజాడ అప్పారావు గారి ముని మనవడు డా? యం. విజయగోపాల్, ఆచార్య యం.వి.ఆర్. రాజు, ఆచార్య సి. మంజులత, విజయనిర్మాణ సంస్థ చైర్మన్,డా? యస్. విజయ కుమార్ తదితరులు పాల్గొంటారని తెలియజేసారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించ బడతాయని వెల్లడించారు.ఈ కార్యక్రమం లో డా అన్నంశెట్టి ఈశ్వరమ్మ ,డా పెంద్యాల లావణ్య ,శ్రీ ఆతుకూరి వెంకటేశ్వర్లు(యోగి ) తదితరులు పాల్గొన్నారు

# తమ్ముళ్లు, చెల్లెళ్లు అందరూ సత్యనాదెళ్లతో పోటీ పడాలి

(మొదటిపేజీ తరువాయి)

సందర్భంగా జగనన్న వసతి దీవెన నిధులను విడుదల చేశారు. జిల్లాలోని నార్పలలో ఏర్పాటు చేసిన బహిరంగ వేదికపై మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యంగా తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబును నరమాంస భక్షకుడితో పోల్చారు. ఈ సందర్భంగా పంచతంత్రంలోని ఓ పులి కథను చెప్పి వినిపించారు. ఇటీవల రిపబ్లిక్ టీవీ నిర్వహించిన ఓ కాంక్లేవ్‌లో చంద్రబాబు మాట్లాడిన మాటలను చూస్తే తనకు ఆ కథ గుర్తుకు వచ్చిందని సీఎం జగన్ వ్యాఖ్యానించారు. నర మాంసానికి అలవాటు పడిన పులి ముసలిదై వేటాడే శక్తి కోల్పోయాక గుంట నక్కలను వెంట వేసుకొని తిరుగుతుందని మాట్లాడారు. బంగారు కడియం ఆశ చూపి మనుషులను మింగేసే పులి లాగానే చంద్రబాబు కూడా వెన్నుపోటు కుట్రలు పన్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మాయమాటలు చెప్పే చంద్రబాబు లాంటి వారిని నమ్మకూడదని, కళ్లార్పకుండా అబద్ధాలు చెప్పే వ్యక్తి చంద్రబాబు అని విమర్శించారు" అడవిలోని ముసలి పులి ఓపిక లేక మనుషుల్ని ఎలా తినాలని ప్లాన్ వేసుకుంది. దారిలో ఓ చెరువు పక్కన కూర్చుని.. వచ్చిపోయే మనుషులకు నగల్ని ఆశ చూపెట్టేది.. 'తమ్ముళ్లా.. కడియం కావాలంటే నీటిలో మునగాలి' అంటూ ఊరించేది. ఈ పులిని నమ్మితే తినేస్తుంది కదా అని అందరూ నమ్మకుండా పోయారు. కానీ, ఆ పులి మాత్రం నేను సీనియర్ మోస్ట్ పులిని. అడవిలో నలభై ఏళ్ల ఇండస్ట్రీ నాది. గతంలో బాగా తినేవాడని.. ఇప్పుడు మంచోడినైపోయి తినదల్చుకోలేదని అబద్ధపు మాటలు చెప్పేది. పులి ముసలిది అయిపోయింది కదా.. అని నమ్మిన వాళ్లా నీటిలో మునిగి ఆ నగలు తీసుకునే ప్రయత్నం చేసేవాళ్లు. ఆ మడుగులో బురదతో ఇరుక్కుంటే పులి చంపేసి తినేసేది. అందుకే అబద్ధాలు చెప్పేవారి మాటలు నమ్మకూడదు "రుణ మాఫీ చేస్తానని రైతులను సైతం మోసం చేసి 2014 ఎన్నికల్లో చంద్రబాబు అధికారంలోకి వచ్చారని గుర్తు చేశారు. బ్యాంకుల్లో తాకట్టులో ఉన్న నగలను సైతం విడిపిస్తానని టీవీల్లో యాడ్లు వేయించేవారని గుర్తు చేశారు. మొత్తానికి సున్నా వడ్డీ పథకాన్ని కూడా రద్దు చేసేసి, అక్కాచెల్లెమ్మల పొదుపు రుణాలు మాఫీ చేస్తానని మోసం చేశారు. నిరుద్యోగ సాయం చేస్తానని హామీ ఇచ్చి మొండి చేయి చూపించాడని సీఎం జగన్ ధ్వజమెత్తారు."దోచుకో, పంచుకో, తినుకో అనే సిద్ధాంతం చంద్రబాబు హాయంలో ఉండేది. చంద్రబాబుకు తోడుగా ఓ గజదొంగల ముఠా ఉంది. అది ఎల్లో మీడియాతో పాటు వారికి తోడుగా ఒక దత్తపుత్రుడు. ఇది గజదొంగల ముఠాగా ఉంది. చంద్రబాబు చెప్తున్న అబద్దాలను, మోసాలను నమ్మకండి. కేవలం మీ బిడ్డ జగనన్న వల్ల మీ ఇంట్లో మంచి జరిగిందో లేదో ఆలోచించండి. జరిగితే మీ బిడ్డకు అండగా నిలబడండి. మీ జగనన్న నమ్ముకున్నది దేవుడి దయను, ప్రజలను. నా ఆత్మవిశ్వాసం మీరే. రాబోయే రోజుల్లో కురుక్షేత్ర యుద్ధం జరగనుంది. మీ దీవెనలు నాకు ఉండాలి" అని సీఎం జగన్ ఆకాంక్షించారు.

# ఆస్తి కోసమే అనుకుంటే చంపాల్సింది వివేకాని కాదు

(మొదటిపేజీ తరువాయి)

సునీత పేరు మీదే ఉన్నాయని షర్మిల కీలక వ్యాఖ్యలు చేశారు. అలాంటప్పుడు సునీత ఆస్తుల కోసమో లేకపోతే ఆస్తి ఇంకెవరికో రాసిస్తాడనో సునీత ఆలోచన చేసిందనే ఆరోపణల్లో, లాజిక్‌లో అసలు అర్థమే లేదన్నారు.
ఒకవేళ.. సునీత భర్త ఆస్తి కోసమే ఇలా చేశారనుకుంటే చంపాల్సింది వివేకానందరెడ్డిని కాదని.. సునీతను చంపాలని (ఆస్తి సునీత పేరు మీద ఉందనే సందర్భంలో షర్మిల ఈ వ్యాఖ్య చేశారు) షర్మిల అన్నారు. ఆస్తి కోసం వివేకాను సునీత, ఆమె భర్త ఏదో చేశారనే ఆరోపణల్లో వాస్తవం లేదని షర్మిల కుండబద్ధలు కొట్టారు. వివేకా ప్రజల మనిషని.. అలాంటి వ్యక్తి గురించి కొన్ని మీడియా హౌస్‌లు పనిగట్టుకుని వ్యక్తిత్వ హననానికి పాల్పడుతూ కథనాలు ప్రసారం చేస్తున్నాయని (సాక్షి ఛానల్‌పై పరోక్ష వ్యాఖ్యలు), ఆ మీడియా హౌస్‌లకు ఆ అర్హతే లేదని షర్మిల వ్యాఖ్యానించారు. అసలు లేని వ్యక్తి మీద, తనకు తాను సంజాయిషీ ఇచ్చుకోలేని వ్యక్తి మీద కొన్ని మీడియా హౌస్‌లు ఆయన క్యారెక్టర్‌ను కించపరిచేలా వార్తలు, కథనాలు ప్రసారం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిల స్పష్టం చేశారు.
వైఎస్ వివేకా హత్య కేసులో సీబీఐ విచారణ వేగవంతం అయినప్పటి నుంచి వైసీపీ సోషల్ మీడియా, వైసీపీ ఎంపీ అవినాశ్ రెడ్డి, జగన్‌కు బాకా ఊదే నీలి మీడియా పనిగట్టుకుని మరీ వివేకా క్యారెక్టర్‌ను తప్పుబడుతున్న సంగతి తెలిసిందే. వైఎస్ వివేకా రెండో పెళ్లిని హైలైట్ చేస్తూ సజ్జల వంటి వాళ్లు మాట్లాడటం, సొంత మీడియాలో కథనాలు ప్రసారం చేయడం, నిందితుల కుటుంబంలోని మహిళలతో కూడా వివేకాకు వివాహేతర సంబంధాలున్నాయని అవినాశ్ కోర్టుకు చెప్పిన విషయం విదితమే. ఒక్కమాటలో చెప్పాలంటే.. వైఎస్ వివేకానందరెడ్డిపై ఒక స్త్రీ లోలుడిగా ముద్ర వేసేందుకు వైసీపీ చేయని పని లేదు. వైసీపీ సొంత మీడియాలో, అధికారిక సోషల్ మీడియాలో వివేకానందరెడ్డి వ్యక్తిత్వ హననానికి వైసీపీ పాల్పడింది. అవినాశ్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి కోర్టులో వాదనలు వినిపించిన సందర్భంలో కూడా ఇదే తరహాలో వ్యాఖ్యానించారు. వివేకా హత్య వెనుక కుటుంబ కలహాలు, రాజకీయ కారణాలు, ఆర్థిక లావాదేవీలు, మహిళలతో సంబంధాలు వంటి అనేక కారణాలు ఉన్నాయని చెప్పి న్యాయస్థానం దృష్టిలో కూడా వివేకా క్యారెక్టర్‌కు తూట్లు పొడిచే ప్రయత్నం చేశారు.
2019 మార్చి 15న వివేకా హత్యకు గురయ్యారు. మొదట గుండెపోటుతో మరణించాడని ప్రచారం జరిగినా మధ్యాహ్నానికి హత్య కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో మొత్తం మూడు సిట్‌లు కలిపి సుమారు 1,300 మంది సాక్షులను, అనుమానితులను విచారించాయి. హైకోర్టు ఆదేశాలతో సీబీఐ విచారణ చేపట్టింది. సీబీఐ సుమారు 250 మంది సాక్షులు, అనుమానితులను ప్రశ్నించింది. సీబీఐకి వాంగ్మూలం ఇచ్చిన వారిలో అనేక మంది అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డిపై సందేహం వ్యక్తం చేశారు. విచారణలో వందలాది మంది ఇచ్చిన సమాచారం ఆధారంగా ఇప్పుడు సీబీఐ అధికారులు వారిద్దరినీ ప్రశ్నిస్తున్నారు. సుదీర్ఘంగా కొనసాగిన కేసు దర్యాప్తులో ఇప్పటి వరకు లభించని సమాచారం, వీరికి మాత్రమే తెలిసిన మరికొన్ని విషయాలపై సీబీఐ అధికారులు వివరాలు రాబడుతున్నట్లు తెలిసింది.

# సీబీఐ ఒక్క కోణంలోనే దర్యాప్తు చేస్తూ నన్ను ఇరికిస్తోంది

(మొదటిపేజీ తరువాయి)

కామెంట్స్ చేయడం గమనార్హం.

**ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ**

**27 కు వాయిదా**

ఎంపీ అవినాశ్ రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ మరోసారి వాయిదా పడింది. తమకు రేపటి దాకా సమయం కావాలని అవినాష్ రెడ్డి తరపు న్యాయవాదులు కోరడంతో విచారణను తెలంగాణ హైకోర్టు రేపటికి వాయిదా వేసింది. రేపు మ.3.30 గంటలకు వాదనలు వింటామని హైకోర్టు న్యాయమూర్తి వెల్లడించారు. కాగా.. పులివెందుల నుంచి కడపకు ఎంపీ అవినాశ్‌రెడ్డి చేరుకున్నారు. కడపలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఉన్నారు. ఆయనను వైసీపీ నేతలు, అనుచరులు వచ్చి కలుస్తున్నారు.కాగా.. అవినాశ్ రెడ్డిలో వేదాంత ధోరణి పెరిగింది. నిన్న ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం తన టైం బాగోలేదని కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి వేదాంత ధోరణిలో, ఒకింత నిర్వేదంగా అన్నారు. హైదరాబాద్ నుంచి మంగళవారం మధ్యాహ్నం పులివెందుల చేరుకున్న ఆయ న.. 3.20 నుంచి రాత్రి 8గంటల వరకు సీఎం క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. 'ఆ రోజు వివేకానందరెడ్డి చనిపోయినట్లు నాకు ఫోన్ వచ్చింది. సునీత భర్త రాజశేఖర్‌రెడ్డి ఫోన్ చేస్తే జమ్మలమడుగు వెళ్తున్న నేను తిరిగి అక్కడకు వెళ్లాను. ఫోన్ రావడం 15 నిమిషాలు ఆలస్యమై ఉంటే ఈ రోజు నా మీద నిందలు ఉండేవి కావు. ఈ కేసులో నన్ను ఇరికించేందుకు కుట్ర జరుగుతోంది. నన్ను, పార్టీని డ్యామేజ్ చేసేందుకు ప్రతిపక్షాలు కుట్ర చేస్తున్నాయి. సునీతమ్మ ఇచ్చిన మొదటి స్టేట్‌మెంటుకు, ఇప్పుడు చాలా వ్యత్యాసాలు ఉన్నాయి. మొదటి స్టేట్‌మెంటులో మా ప్రస్తావన లేదు. నాన్నకు, (శివ)శంకర్‌రెడ్డి అన్నకు ఎలాంటి సంబంధం లేదు. నేను ఏ పాపం చేయలేదు కాబట్టే మూడేళ్లుగా మీడియా ముందుకొచ్చి మాట్లాడలేదు. మాట్లాడి ఉంటే బాగుండేది' అని చెప్పారు. సీబీఐ అంటే పెద్ద విచారణ సంస్థ అని.. ఇలా విచారిస్తుందని ఊహించలేదన్నారు. దేవుడు తమ వైపే ఉన్నాడని.. ఎలా రాసిపెడితే అలా జరుగుతుందంటూ వేదాంత ధోరణిలో మాట్లాడారు. సీబీఐ మిమ్మల్ని అరెస్టు చేస్తుందా అంటూ ఓ మీడియా ప్రతినిధి ప్రశ్నించగా.. 'అంతా దైవాధీనం.. ధర్మో రక్షతి రక్షితః అనే దాన్ని నేను నమ్మాను. ధర్మమే కాపాడుతుంది' అని అవినాశ్ రెడ్డి అన్నారు.

# ఖమ్మం బాధ్యతలు హరీష్ రావుకే..?

**ఖమ్మం :**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ పట్టు జారకుండా ఉండేందుకు పకడ్బందీ వ్యూహాలు రచిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మంత్రి కేటీఆర్‌కు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి మధ్య దోస్తానా ఎక్కువ. ఇప్పటికే పలుమార్లు పొంగులేటి పార్టీని వీడకుండా చర్యలు చేపట్టారు. ఇదే విషయాన్ని పొంగులేటి సైతం పలుమార్లు మీడియా ముందు పేర్కొన్నారు.అయినప్పటికీ అసంతృప్తితో పార్టీని వీడటంతో కేటీఆర్‌కు ఖమ్మం జిల్లా బాధ్యతలను అప్పగిస్తే బాగుండదని, విమర్శలు, ప్రతి విమర్శలు ఉండవని అధిష్టానం భావించినట్లు పార్టీ నేతలు గుసగుసలాడుతున్నారు.పొంగులేటి పలు సందర్భాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలను వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ గేటును కూడా తాకనివ్వను అంటూ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకున్న అధిష్టానం హరీశ్ రావుకు అసెంబ్లీ ఎన్నికల క్యాంపెయినర్ బాధ్యతలను అప్పగించినట్లు పార్టీలోని కీలక నేత ఒకరు తెలిపారు. పొంగులేటి దూకుడుకు అడ్డుకట్ట వేయాలంటే హరీశ్ తో సాధ్యమని నేతలు సైతం అభిప్రాయపడుతున్నారుమాజీ ఎంపీ పొంగులేటి వెంట బీఆర్ఎస్‌కు చెందిన కేడర్ వెళ్లకుండా సంప్రదింపులు ప్రారంభించినట్లు తెలిసింది. ఇప్పటికే కొంతమంది నేతలు బీఆర్ఎస్‌లో కొనసాగుతూ పొంగులేటి వెంట తిరుగుతున్నారు. అయితే వారితో



కూడా త్వరలోనే మంతనాలు చేయనున్నట్లు తెలిసింది. ఆఫర్లు సైతం ప్రకటించనున్నట్లు విశ్వసనీయ సమాచారం. అందులో భాగంగానే ఇప్పటి వరకు బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్న నేతలపై, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై చర్యలకు వెనుకంజ వేస్తున్నారని సమాచారం. ఎన్నికల ముందు పార్టీని వీడితే ఎఫెక్ట్ పడుతుందని, అందుకే చూసీచూడనట్లు అధిష్టానం వ్యవహరిస్తుంది. మంత్రి ఖమ్మంలో పార్టీని గట్టెక్కిస్తారా? పొంగులేటి చేతిలో పెడతారా? అనేది పార్టీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.అసెంబ్లీ ఎన్నికల క్యాంపెయినర్‌గా ఖమ్మం జిల్లా బాధ్యతలను పార్టీ అధిష్టానం ట్రబుల్ షూటర్ మంత్రి హరీశ్ రావుకు అప్పగించినట్లు సమాచారం. పొంగులేటిని ఢీకొట్టేందుకు అతడే కరెక్ట్ అని నిర్ధారణకు వచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అందులో భాగంగానే సత్తుపల్లి నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనంలో హరీశ్ పాల్గొన్నట్లు చర్చ సాగుతోంది. జిల్లాపై పట్టుసాధించేందుకు ఇప్పటికే బీఆర్ఎస్ హై కమాండ్ పక్కా ప్లాన్ ఖరారు చేసినట్లు తెలిసింది. ఎవరు కూడా పొంగులేటి వెంట పోకుండా ఇప్పటికే చర్యలు చేపట్టినట్లు సమాచారం. ఉమ్మడి ఖమ్మం జిల్లాపై అధిష్టానం ప్రత్యేక ఫోకస్ పెట్టింది. మొత్తం 10 అసెంబ్లీ స్థానాల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది.ఏ ఎన్నికలైనా ఇన్‌చార్జి బాధ్యతలను సక్సెస్ ఫుల్‌గా నిర్వర్తిస్తాడని, పార్టీని గట్టెక్కిస్తాడని హరీశ్ రావుకు పేరుంది. అయితే ఇప్పటికే కేసీఆర్ సిట్టింగ్‌లకే టికెట్లు అని ప్రకటించడం.. వారిని విజయతీరాలకు చేర్చేందుకే హరీశ్ రావుకు బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అందులో భాగంగానే సత్తుపల్లిలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని శ్రేణులకు దిశానిర్దేశం చేశారనే ప్రచారం ఊపందుకున్నది.గత ఎన్నికల్లో ఖమ్మం అసెంబ్లీలో మాత్రమే బీఆర్ఎస్ విజయం సాధించగా, మిగిలిన 9 నియోజకవర్గాల్లో 7 కాంగ్రెస్, 2 టీడీపీ విజయం సాధించింది. అందులో భద్రాచలం, ములుగు నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు మాత్రం కాంగ్రెస్‌ను వీడలేదు. మిగిలిన నేతలంతా అధికార పార్టీలో చేరారు. ఈసారి ఉమ్మడి జిల్లాలోని 10స్థానాల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ పావులు కదుపుతోంది. అందుకోసం పార్టీ అధిష్టానం ఇప్పటికే ఎమ్మెల్యేలకు, నేతలకు సైతం షెడ్యూల్ ఇచ్చినట్లు సమాచారం. దాని ప్రకారమే జిల్లాలో కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారని తెలిసింది.

# జగన్ ప్రభుత్వం మైనారిటీలను మోసం చేసింది

(మొదటిపేజీ తరువాయి)

మైనారిటీలతో ప్రత్యేక సమావేశం చేయడంతో పాటు వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. జగన్ ప్రభుత్వం మైనారిటీలను మోసం చేసిందని విమర్శించారు.మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ టీడీపీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని, కర్నూలులో ఉర్దూ యూనివర్సిటీ పెట్టిన ఘనత తమదేనని చంద్రబాబు అన్నారు. దుల్హన్ పథకం అమలు చేశామని, దీనిపై వైసీపీ నిబంధనలు పెట్టి.. దుల్హన్ పథకాన్ని నాశనం చేసిందన్నారు. రంజాన్ తోఫా ఇచ్చి పేద ముస్లింల ఇంట టీడీపీ వెలుగులు నింపామన్నారు. ఇప్పుడు ముస్లింలకు ఇవ్వాల్సిన పథకాలకు వైసీపీ తిలోదకాలు ఇచ్చిందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి నోరు తెరిస్తే అబద్ధాలు చెప్పడం పరిపాటయిందన్నారు. జగన్ అధికారంలోకి రాగానే సాక్షి పేపర్‌కు రూ. 1000 కోట్ల యాడ్స్ ఇచ్చారని ఆరోపించారు. గతంలో మసీదులు, ఈద్గాలు, మౌళనాలకు జీతాలు ఇచ్చామన్నారు. ఈ ప్రభుత్వం మైనారిటీ సోదరులపై అక్రమ కేసులు పెట్టి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని.. చూస్తూ ఊరుకోమని చంద్రబాబు హెచ్చరించారు. ముస్లిం మైనారిటీలకు తన ప్రాణం అడ్డుపెట్టి కాపాడుతానన్నారు. జగన్ పోలీసులతో కేసులు పెట్టి పరిపాలన చేయాలని చూస్తున్నారని.. న్యాయస్థానాలు ఉన్నాయి కాబట్టి ఏపీలో టీడీపీ కార్యకర్తలు ప్రజలు బ్రతుకుతున్నారన్నారు.ఎంపీ అవినాష్ రెడ్డిపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా.. ఇంకా నిర్దోషిని అని అనడం విడ్డురంగా ఉందని చంద్రబాబు అన్నారు. మైనారిటీ యువతులు, మహిళలు, బాలికలు వైసీపీ వారి చేతులలో బలైపోయారని.. ఇన్ని రకాలుగా హత్యలు, మానభంగాలు చేస్తున్నా.. సీఎం చోద్యం చూస్తూ కూర్చున్నారని మండిపడ్డారు. నంద్యాలలో మైనారిటీ కుటుంబ సభ్యులు నలుగురు మూకుమ్మడిగా ఆత్మహత్య చేసుకుందని, అంగన్‌వాడి వర్కర్ ఒంటరి మహిళను ఇబ్బందులు పెట్టి రాజద్రోహం కేసులు పెట్టారని, గురజాల, మాచర్లలో వంద కుటుంబాలు రక్షణ లేక గ్రామం వదలి వెళ్లిపోయారని అన్నారు. ఇసుక దండాపై పోరాటం చేస్తున్న కొమ్మలాపాటిపై అక్రమ కేసులు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. హైదరాబాద్, ఓల్డ్ సిటీలో మతకలహాలు లేకుండా చేసిన ఘనత టీడీపీదేనన్నారు. ముస్లిం మైనారిటీలపై దాడులు చేసిన వారిపై ప్రత్యేక చట్టం తీసుకువచ్చి.. కఠిన చర్యలు ఉండేవిధంగా చేస్తానన్నారు. టీడీపీ హయాంలో మైనరిటీలను రాజకీయంగా అభివృద్ధి చేశామని.. ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లు కావాలని పోరాటం చేశామన్నారు. ముస్లింలకు సబ్ ప్లాన్ అమలు చేసే బాధ్యత తనదని చంద్రబాబు హామీ ఇచ్చారు.

ప్రజా తపన
prajathapana.com

# జేసీ కామెంట్స్ పై చర్చ- రచ్చ

**అనంతపురం:**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయి తొమ్మిదేళ్లు కావస్తుంది. అయినా ఇప్పటికీ కొందరు నేతలు సెంటిమెంట్‌ను పట్టుకుని వేలాడుతున్నారు. తాజాగా రాయలసీమ నేత జేసీ దివాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఏ కోణంలో చూడాలంటే ఎవరికీ అర్థం కాలేదు. రాష్ట్రం విభజన జరిగిన తొమ్మిదేళ్ల తర్వాత తిరిగి జేసీ దివాకర్ రెడ్డి రాయల తెలంగాణ నినాదాన్ని ఎత్తుకోవడం ఎలా చూడాలి? ఏపీలో రాజకీయంగా ఇబ్బందులు ఎదురు కాబట్టే జేసీ ఈ మంత్రం ఉపయోగించారా? లేక రానున్న ఎన్నికల్లో సెంటిమెంట్‌ను వాడుకునే ప్రయత్నంలో భాగంగా అన్నారా? అన్నది తెలియదు కానీ జేసీ దివాకర్ రెడ్డి ప్రయత్నం మాత్రం రాజకీయ కోణంలోనే చూడాల్సి ఉంటుంది. ఒక ఫ్యాక్షన్ నాయకుడు రాయలసీమలో నీటి కోసం పరితపించడమేంటని నెటిజన్లు సోషల్ మీడియాలో స్మైల్ ఈమోజీలు పెడుతున్నారంటే జేసీ కామెంట్స్‌ను రాయలసీమ వాసులు ఎంత సీరియస్‌గా తీసుకున్నారన్నది అర్థమవుతుంది. జేసీ దివాకర్ రెడ్డి తరచూ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తుంటారు. ఒకసారి తెలుగుదేశం గెలవడం కష్టమంటారు. మరోసారి జగన్ మరోసారి అధికారంలోకి రాలేదంటారు. అంత కన్ఫ్యూజన్‌లో జేసీ ఉంటారు. రాయల తెలంగాణ అంశం సమసిపోయిన అంశం. విభజన జరిగినప్పుడే అది పెద్దయెత్తున వినిపించి ఉంటే కొంత ఆలోచించి ఉండేవారు. కానీ ఇప్పుడు సాధ్యాసాధ్యాలను ఆలోచించకుండా జేసీ దివాకర్ రెడ్డి చేస్తున్న ప్రకటనలు విచిత్రంగా కనిపిస్తుంటాయి. అనిపిస్తుంటాయి.ఇప్పుడు రాయల తెలంగాణకు ఎవరు ముందుకు వస్తారు? తెలంగాణలోని పార్టీలు ఎందుకు అంగీకరిస్తాయి? మరోసారి రాయలసీమ పెత్తనాన్ని తమ రాష్ట్రంలో ఎందుకు కోరుకుంటారు. రాయల తెలంగాణ వస్తే జగన్, చంద్రబాబుకు కూడా పట్టు పెరుగుతుంది. అందుకనే బీఆర్ఎస్ నుంచి బీజేపీ వరకూ ఏ పార్టీ అందుకు అంగీకరించదు. అంతెందెందుకు జగన్, చంద్రబాబు వంటి ముఖ్య నేతలు ఏపీకి దూరమవుతారు. అలాంటిది రాయల తెలంగాణకు ఎందుకు అంగీకరిస్తారు? ఈ లాజిక్‌ను జేసీ దివాకర్ రెడ్డి మిస్ అవుతున్నారంటున్నారు. తనకు వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా ఇబ్బందులు తలెత్తినప్పుడే జేసీకి రాయల తెలంగాణ గుర్తుకు వస్తుందంటారు. అంతెందుకు ఆయనతో పాటు ఆయన కుటుంబ సభ్యులు ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబు కూడా జేసీ వ్యాఖ్యలు విని నవ్వుకునే ఉంటారు తప్ప సీరియస్‌గా తీసుకోరు. రాయల తెలంగాణ వస్తే తాగు, సాగు నీటి సమస్యలు పరిష్కరమవుతాయని జేసీ చెబుతున్నారు. ఏపీలో కూడా ఎందుకు సాధ్యం కాదన్న ప్రశ్నకు జేసీ వద్ద సమాధానం లేదు. గత ఎన్నికల్లో తాడిపత్రితో సహా అనంతపురంలో తన కుటుంబ సభ్యులు ఓటమి పాలు కావడంతో జేసీ దివాకర్ రెడ్డికి మైండ్ బ్లాంక్ అయిందనే వారు కూడా లేకపోలేదు. విభజన జరిగిన తొమ్మిదేళ్లు దాటిన తర్వాత కూడా రాయల తెలంగాణ అంటే ప్రజలు కూడా ఎందుకు అంగీకరిస్తారని అంటున్నారు. అయితే జేసీని ఎవరూ సీరియస్‌గా తీసుకోరు కాబట్టి సరిపోయింది. ఒక ఉద్యమాన్ని నిర్మించలేని నేత కాబట్టి సర్దుకుపోతున్నారు. అంతే తప్పించి జేసీ మాటలను రాజకీయంగా ఎవరూ సీరియస్ గా తీసుకోరు. పొలిటికల్ తెరమీద కనిపించే కమెడియన్‌గా మాత్రమే జనంతో పాటు రాజకీయ పార్టీలు చూడటం వల్లనే ఆయన కామెంట్స్ పెద్దగా పట్టించుకోరు కాబట్టి సరిపోయింది. లేకుంటే ప్రజలు సీరియస్‌గా తీసుకుంటే. అందుకే జేసీ దివాకర్ రెడ్డిని సీరియస్‌గా మాత్రం ఎవరూ తీసుకోరన్నది వాస్తవం.

# ఒంటరి పోరే సో బెటర్ అంటున్న తమ్ముళ్లు

**గుంటూరు :**

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు పొత్తుల కోసం ప్రయత్నిస్తున్నారు. అయితే పొత్తులు పెట్టుకుంటే ఆ నియోజకవర్గంలో ఇక టీడీపీ కోలుకోలేని పరిస్థితి నెలకొంటుందన్నది గత చరిత్రను పరిశీలిస్తే అవగతమవుతుంది. పొత్తులు పెట్టుకుని ఇతర పార్టీలకు సీట్లు కేటాయించడంతో అక్కడ క్యాడర్ డైలమాలో పడుతుంది. యాక్టివ్ గా ఉండకపోవడం, అక్కడ ఎన్నికైన ఎమ్మెల్యే కూడా టీడీపీ క్యాడర్ కు సహకరించకపోవడంతో కొన్ని నియోజకవర్గాల్లో పొత్తులు పెట్టుకుని ఇప్పటికీ కోలుకోలేదన్న విషయాన్ని ఆ పార్టీ నేతలు కొందరు గుర్తు చేస్తున్నారు. చంద్రబాబు పర్యటనలకు మంచి స్పందన లభిస్తుంది. జనం కూడా చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పొత్తులు పార్టీకి నష్టం చేస్తాయనే వారు కూడా ఇటీవల కాలంలో పెరిగిపోయారు. ఆయన జిల్లాలో పర్యటనలో పొత్తుల వద్దంటూ నేతలు వేడుకుంటున్నారు.వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు పొత్తులకు సిద్ధమవుతున్నారు. జనసేనతో ఆయన పొత్తును బలంగా కోరుకుంటున్నారు. కలసి వస్తే బీజేపీతో నడిచేందుకు సిద్ధమయ్యారు. అందుకు అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి బీజేపీ, కమ్యునిస్టులు, టీఆర్ఎస్ ఇలా అన్ని పార్టీలతో చంద్రబాబు పొత్తు పెట్టుకున్నారు. అయితే విభజన ఆంధ్రప్రదేశ్ లో 2014లో ఒక్క బీజేపీతో నేరుగా పొత్తు పెట్టుకున్నారు. జనసేన ఈ కూటమికి మద్దతు నిచ్చింది. అయితే 2014 ఎన్నికల్లో బీజేపీకి అతి తక్కువ స్థానాలను పొత్తులో భాగంగా టీడీపీ కట్టబెట్టింది. అయినా నాలుగు స్థానాల్లో బీజేపీ విజయం సాధించింది. విశాఖ పట్నంలోని ఉత్తర నియోజకవర్గం నుంచి విష్ణుకుమార్ రాజు, తాడేపల్లి గూడెం నుంచి మాణిక్యాలరావు, కైకలూరు నుంచి కామినేని శ్రీనివాస్, రాజమండ్రి అర్బన్ నియోజకవర్గం నుంచి ఆకుల సత్యనారాయణ విజయం సాధించారు. ఈ స్థానాల్లో టీడీపీ గత ఏడాది ఎన్నికల్లో బలహీనమయింది. 2019 ఎన్నికల్లో విశాఖ ఉత్తర నియోజకవర్గంలో టీడీపీ నుంచి పోటీ చేసిన గంటా శ్రీనివాసరావు కేవలం రెండు వేల ఓట్ల మెజారిటీతోనే గెలుపొందారు. ఇక తాడేపల్లి గూడెం నియోజకవర్గంలో 2014లో బీజేపీకి కేటాయిస్తే 2019 ఎన్నికల్లో అక్కడ గెలవలేదు. కైకలూరులో 2014లో బీజేపీకి కేటాయిస్తే అక్కడ 2019 ఎన్నికల్లో గెలవని పరిస్థితి. ఇక విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనే కమ్యునిస్టులకు టీడీపీ కేటాయించింది. ఇంతవరకూ టీడీపీ పశ్చిమ నియోజకవర్గంలో గెలిచిన చరిత్ర లేదు.ఇక 2014 ఎన్నికల్లో టీడీపీ పొత్తులో భాగంగా నరసరావుపేటను కేటాయించింది. కానీ ఆ తర్వాత ఏడాది ఒంటరిగా పోటీ చేస్తే గెలుపు సాధ్యపడలేదు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం కూడా అంతే. 2014లో బీజేపీకి కేటాయిస్తే 2019 ఎన్నికల్లోనూ ఓటమి పాలయింది. ఇవన్నీ టీడీపీ నేతలు గుర్తు చేస్తున్నారు. పార్లమెంటు నియోజకవర్గాలు కూడా అంతే. అంతెందుకు టీడీపీ పొత్తులో భాగంగా తిరుపతి పార్లమెంటును 1999లో కేటాయిస్తే ఇంతవరకూ అక్కడ టీడీపీ నెగ్గలేదు. అందుకే పొత్తులు వద్దని కొందరు సూచిస్తున్నారు. బీజేపీ కాబట్టి తక్కువ స్థానాలను కేటాయించాల్సి వచ్చింది. అదే జనసేనకు అయితే కనీసం నలభై స్థానాలను కేటాయించాల్సి వస్తుంది. అక్కడ పార్టీ భవిష్యత్ ను కోల్పోతుందన్న ఆందోళన టీడీపీ నేతల్లో వ్యక్తమవుతుంది. ఒంటరిగా పోటీ చేసి అధికారం దక్కించుకుంటే ఈ పరిస్థితి పార్టీకి ఉండదన్నది ఎక్కువ మంది నేతలు అభిప్రాయపడుతున్నారు. పొత్తులతో అధికారంలోకి వచ్చినా ఆ తర్వాత అక్కడ పార్టీ బలహీనంగా మారుతుందన్న విషయాన్ని ఈ సందర్భంగా సీనియర్ నేతలు గుర్తు చేస్తున్నారు

# ఏప్రిల్ 28న వేద విశ్వవిద్యాలయం 7వ స్నాతకోత్సవం

**- 550 మంది విద్యార్థులకు పట్టాలు ప్రధానం**

**- ఇద్దరికి మహామహోపాధ్యాయ, ఇద్దరికి వాచస్పతి పురస్కారాలు ప్రధానం**

**విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య రాణి సదాశివ మూర్తి**

**తిరుపతి**

శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం 7వ స్నాతకోత్సవం ఏప్రిల్ 28వ తేదీ ఉదయం 11 గంటలకు మహతి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నామని విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి తెలిపారు. సర్టిఫికెట్ కోర్సుల నుండి పి హెచ్ డి దాకా కోర్సులు పూర్తి చేసుకున్న 550 మంది విద్యార్థులకుఈ సందర్భంగా పట్టాలు బహూకరిస్తామన్నారు. అలాగే ఇద్దరికి మహామహోపాధ్యాయ, ఇద్దరికి వాచస్పతి పురస్కారాలు ప్రధానం చేస్తామని ఆయన వివరించారు.

విశ్వవిద్యాలయంలో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. వేద పరిరక్షణ, వేద ప్రచారం కోసం టీటీడీ 2006 లో శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం స్థాపించిందన్నారు. గతం పని చేసిన ఉప కులపతుల ఆధ్వర్యంలో సాధించిన ప్రగతిని మరింత పెంచడం కోసం కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఈవో ఎవి ధర్మారెడ్డి సహకారం, మార్గదర్శనంలో విశ్వవిద్యాలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి బాటలో ముందుకు తీసుకు వెళుతున్నామన్నారు. ఇందులో భాగంగా ఏప్రిల్ 28వ తేదీ 7వ స్నాతకోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. విశ్వవిద్యాలయం కులపతి, రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఈవో ఎవి ధర్మారెడ్డి స్నాతకోత్సవంలో పాల్గొంటున్నారని తెలిపారు.

వీరికి అత్యున్నత పురస్కారాలు

తమ జీవితాన్ని వేద విద్య వ్యాప్తికి, వేద పరిరక్షణకు అంకితం చేసిన హైదరాబాద్ కు చెందిన బ్రహ్మశ్రీ వి. సుబ్రహ్మణ్య శాస్త్రి ఘనపాటి, చెన్నై కి చెందిన బ్రహ్మశ్రీ రామచంద్ర మణి ద్రావిడ శాస్త్రి కి మహామహోపాధ్యాయ అత్యున్న పురస్కారం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. వేదంలో మంచి ప్రావీణ్యం ఉండి వేద పరిరక్షణకు కృషి చేస్తున్న అన్నవరం కు చెందిన బ్రహ్మశ్రీ కపిలవాయి రామ సోమయాజి శాస్త్రి, మైసూరు కు చెందిన బ్రహ్మశ్రీ సి. వంశీకృష్ణ ఘన పాటి కి వాచస్పతి పురస్కారం తో సన్మానిస్తామని ఉపకులపతి ప్రకటించారు.

## ఇదీ ప్రగతి

వేద విశ్వవిద్యాలయం లో బోధన పరంగా, వసతుల కల్పన, ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేసే అంశాలకు సంబంధించి అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. 2023- 24 విద్యా సంవత్సరం నుంచి జాతీయ విద్యా విధానం ( నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ) అమలు చేస్తామన్నారు. ఇందుకు అనుగుణంగా భోధనాంశాల్లో మార్పులు, చేర్పుల కోసం మూడు నెలలుగా కసరత్తు చేసినట్లు ఆచార్య రాణి సదాశివమూర్తి వివరించారు. వ్యాకరణం, న్యాయ విభాగాల్లో ఎం ఎ కోర్సులు ప్రవేశ పెడుతున్నామన్నారు. సంస్కృతం నుండి ఆంగ్లం, తెలుగు భాషల్లోకి అనువాదాలు చేయడం కోసం అనువాద అభ్యసన కోర్సులు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. వివిధ ధ్యాన ప్రమాణాలు- ప్రాచీన మనో విజ్ఞాన విశేషాలు సమాజానికి అందించడానికి సూపర్ సెన్సరీ నాలెడ్జ్ కోర్సులు ప్రారంభిస్తామని తెలిపారు. దీంతోపాటు యోగ లో ప్రస్తుతం సర్టిఫికెట్ కోర్సులు అందిస్తున్నామని, ఇకపై డిప్లమా కోర్సులు ప్రారంభిస్తామని చెప్పారు.

పర్యావరణ పరిరక్షణ కోసం విశ్వవిద్యాలయం పరిధిలో యజ్ఞ, ఓషధీ, ఏక విసంతి పత్ర, నక్షత్ర, నవగ్రహ, శిలా వనాలు ఏర్పాటు చేస్తున్నామని ఆయన చెప్పారు. వీటితో పాటు యాగశాల, యోగ శాల నిర్మిస్తున్నామన్నారు.

## తాళ పత్రాల పరిరక్షణ కోసం....

టీటీడీ ఆధ్వర్యంలో తాళ పత్ర గ్రంథాల పరిరక్షణ కోసం మ్యాన్ స్క్రిప్ట్ ప్రాజెక్టు నిర్వహిస్తోందని ఉపకులపతి తెలిపారు. ఎస్వీ విశ్వవిద్యాలయం, పురావస్తు శాఖల వద్ద ఉన్న తాళ పత్రాలను స్కాన్ చేసి డిజిటైజ్ చేస్తున్నామన్నారు. అలాగే దేశంలో ఎవరైనా తమవద్ద ఉన్న తాళ పత్రాలను తమకు అందిస్తే వాటిని డిజిటైజ్ చేసి దాతకు ఇవ్వడంతో పాటు అసలు తాళ పత్రాలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి 500 సంవత్సరాలు గడిచినా చెక్కు చెదరకుండా ఉండేలా వాటిని భద్ర పరుస్తామన్నారు. ఇందుకోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో బంకర్లు నిర్మించి, లాకర్లు ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. అలాగే తాళ పత్రాలను చదివి, అర్థం చేసుకోవడానికి ప్రత్యేకంగా డిప్లమా, సర్టిఫికెట్ కోర్సు ప్రారంభిస్తామని చెప్పారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య రాధేశ్యాం, టీటీడీ ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ రవి, విశ్వవిద్యాలయం ప్రజాసంబంధాల అధికారి ఆచార్య బ్రహ్మా చార్యులు మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

# గుడివాడలో కాపు ఓటరు ఎటూ

**విజయవాడ :**

గెలుపు ఓటముల్లో కాపు ఓటు బ్యాంకే కీలకం గుడివాడ రాజకీయాలు ఎప్పుడూ ఆసక్తి రేపుతూనే ఉంటాయి. గతంలో ఎన్టీఆర్ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గం ఇది. ఇక్కడి నుంచి వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యే అయ్యారు కొడాలి నాని. రెండు విడతలు టీడీపీ నుంచి, మరో రెండు సార్లు వైసీపీ నుంచి ఎమ్మెల్యే అయ్యారాయన. మారిన రాజకీయ పరిస్థితుల్లో కొడాలిని ఓడించి తీరాలని పట్టుదలగా ఉందట టీడీపీ. అదే సమయంలో వైసీపీ కూడా ఈ సీటును ప్రతిష్టాత్మకంగా తీసుకుందట. సాధారణంగా గుడివాడ అనగానే? కమ్మ సామాజికవర్గం డామినేటెడ్ అనుకుంటారు. కానీ.. వాస్తవంలో మేటర్ వేరే ఉంది. దాదాపు 2 లక్షల ఓటర్లు గుడివాడ నియోజకవర్గంలో ఉన్నారు. ఇందులో లక్షా పదివేల ఓట్లు బీసీలవే. ఎస్సీలకు 45 వేలు, కాపులకు 35 వేల ఓట్లు ఉన్నాయి. మొత్తంగా చూసుకున్నప్పుడు ప్రతి ఎన్నికలో ఇక్కడ కాపు ఓటు బ్యాంకు కీలకంగా మారుతోందంట. దీంతో ఆ ఓటు బ్యాంకును తమ వైపు తిప్పుకునే ప్రయత్నాల్లో ఉన్నాయట ప్రధాన పార్టీలు.కాపు ఓటర్లు జనసేన వైపు మొగ్గుచూపే అవకాశం ఎక్కువన్నది రాజకీయ పార్టీల అంచనా . గత ఎన్నికల్లో ఓటింగ్ తీరును బట్టి ఈ క్లారిటీకి వచ్చాయట. గత 4 సార్వత్రిక ఎన్నికలను పరిశీలిస్తే 2004లో టీడీపీ తరపున పోటీ చేసిన కొడాలి నాని కాంగ్రెస్ అభ్యర్థి కఠారిపై 8 వేలకుపైగా మెజార్టీతో గెలిచారు. 2009 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగానే ఉన్న కొడాలి నానికి 68 వేల ఓట్లు వచ్చాయి. అప్పుడు కాంగ్రెస్‌కు 50 వేలు, ప్రజారాజ్యానికి 21 వేల ఓట్లు పడ్డాయి. ప్రజారాజ్యం పార్టీ కాపు ఓట్లను భారీగా చీల్చిందన్నది నాటి లెక్క. ఇక 2014లో కొడాలి వైసీపీ అభ్యర్థిగా బరిలో దిగారు. ఫైట్ వైసీపీ, టీడీపీ మధ్య జరగటంతో నాని గెలిచారు. 2019లో జనసేన అభ్యర్థి గణేష్ నామినేషన్‌ను తిరస్కరించడంతో ఫైట్ వైసీపీ, టీడీపీకి పరిమితమై నాలుగోసారి గెలిచారు కొడాలి. ఆయన వరుస విజయాలకు కాపు ఓట్ బ్యాంకే కీలకం అన్నది లోకల్ టాక్. కృష్ణా జిల్లాలో కాపు సామాజికవర్గానికి ఆరాధ్యదైవం లాంటివారు వంగవీటి మోహనరంగా. ఆయన కుమారుడిగా రాధాకు కూడా ప్రాధాన్యం ఉంది. రాధాతో కొడాలికి ఉన్న స్నేహ సంబంధాలే ఆయన విజయ రహస్యం అన్నది విశ్లేషకుల మాట. రాధా టీడీపీలో ఉన్నా? గుడివాడలో మాత్రం ఆ పార్టీ తరపున ప్రచారం చేయరు. కొడాలితో ఉన్న స్నేహం కారణంగానే ఆయన అలాంటి స్టాండ్ తీసుకుంటారన్నది వారి సన్నిహితుల మాట.ఈసారి ఎలాగైనా?కొడాలిని గుడివాడలో ఓడించాలని పట్టుదలగా ఉన్న టీడీపీ కూడా నియోజకవర్గంలోని కాపు సామాజిక వర్గంపై ఫోకస్ పెట్టిందట. అందుకే..తెలుగుదేశం తరపున రాధా రావి మిత్ర మండలిని కూడా ఏర్పాటు చేశారట. రంగా వర్ధంతి కార్యక్రమాలను స్థానికంగా నిర్వహిస్తున్నారు. అయితే గుడివాడ ఎప్పుడు వచ్చినా రాధా? టీడీపీ కార్యక్రమాలకు దూరంగా ఉండి, నానితో మాత్రమే కలుస్తుంటారు. ఈ పరిస్థితుల్లో ఇటీవల జరిగిన రంగా వర్ధంతి కార్యక్రమాలను టీడీపీ, వైసీపీ పోటా పోటీగా చేయటం ఉద్రిక్తతకు దారితీసింది. గుడివాడ టీడీపీ ఇన్చార్జి రావి కూడా రాధాను పలు కార్యక్రమాల్లో కలవటమే తప్ప అంతకు మించి ఏం జరగటంలేదట. మరోవైపు జనసేన అధినేత పవన్ ను కొడాలి తన మాటల తూటాలతో ఇబ్బంది పెడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఈసారి కాపు సామాజిక వర్గం ఓటు బ్యాంకు ఎటు టర్న్ అవుతుందోనన్న ఉత్కంఠ పెరుగుతోందట.

# మళ్లీ కన్నా, రాయపాటి లొల్లి

**గుంటూరు :**

ఉమ్మడి గుంటూరు జిల్లాలో,.. కాదు కాదు.. అసలు ఏపీ రాజకీయాల్లోనే రాయపాటి సాంబశివరావు, కన్నా లక్ష్మీనారాయణ వైరం గురించి తెలియని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. అలాంటి నేతలు ఆ మధ్య ఓ పరువు నష్టం కేసులో రాజీ చేసుకుని.. కోర్టులో చేతులు కలుపుకుని దోస్త్ మేరా దోస్త్ అనేసుకున్నారు. అనుకున్నట్లే మూడు నెలలు కామ్‌గానే ఉన్నారు. కానీ.. ఎన్నికలు సమీపిస్తున్న వేళ కన్నా లక్ష్మీనారాయణ టిడిపిలోకి చేరిపోయారు. అదే పార్టీలో సీనియర్‌గా ఉన్న రాయపాటి .. కన్నా రాకను బహిరంగంగా వ్యతిరేకించినా ఏమీ చేయలేకపోయారు. చివరికి తనదైన భాషలో పార్టీకి, కన్నాకు స్వీట్ వార్నింగ్ ఇచ్చారు. మళ్ళీ కొన్నాళ్ళ మౌనం తర్వాత కన్నా ఇచ్చిన విందుకు తన సోదరుడు రాయపాటి శ్రీనివాసరావును పంపించారు సాంబశివరావు. అక్కడితో కథ సుఖాంతమైందని అంతా అనుకున్నారు. కానీ.. మేటర్ మిగిలే ఉందని చెబుతున్నాయి రాయపాటి తాజా వ్యాఖ్యలు.ఎన్నాళ్ళో వేచిన ఉదయం లాగా? ఎన్నాళ్లో వేగిన హృదయం నాది అని సాంగేసుకుంటూ కన్నా మీద కామెంట్స్ చేస్తున్నారట. నన్ను దశాబ్ద కాలం వేధించారు, రాజకీయ, ఆర్థిక వ్యవహారాల్లో ఇబ్బందులు పెట్టారని, ఆయనతో రాజీ పడే ప్రసక్తే లేదని కుండబద్దలు కొట్టారట రాయపాటి సాంబశివరావు. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లా రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. వచ్చే ఎన్నికల్లో కన్నా లక్ష్మీనారాయణ ఎక్కడైతే పోటీ చేయాలనుకుంటున్నారో? సరిగ్గా అక్కడే తన పరపతిని ఉపయోగించి ఆయనకు వ్యతిరేకంగా గ్రూపులు కట్టే ప్రయత్నం చేస్తున్నారట రాయపాటి. అదే క్రమంలో తన కొడుకు రంగబాబుకి సత్తెనపల్లి టీడీపీ టిక్కెట్ ఇవ్వాలన్న ప్రతిపాదనను తెరమీదికి తెచ్చారట. కన్నా లక్ష్మీనారాయణ ఈసారి సత్తెనపల్లి మీద గురిపెట్టారని ముందుగా తెలుసుకున్న రాయపాటి ఆయనకు చెక్ పెట్టేందుకే తన కుమారుడిని ముందు పెడుతున్నారన్న ప్రచారం జరుగుతోంది.గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు బద్ధ విరోధులుగా ఉన్న ఈ ఇద్దరూ ఇప్పుడు టిడిపిలో కూడా అదే తరహా రాజకీయాలను నడుపుతుండటంతో క్యాడర్ గందరగోళంలో పడుతోందట. అయితే? వ్యతిరేక చర్యలు ఏం చేసినా? అంతా రాయపాటే చేస్తున్నారు తప్ప ప్రస్తుతం ఈ వ్యవహారంపై కన్నా నోరు మెదపడం లేదట. సన్నిహితుల దగ్గర కూడా ఏం మాట్లాడకుండా తాను చేయదల్చుకున్నది చేసుకుని పోతున్నారట. అటు రాయపాటి మాత్రం టీడీపీలో తాను సీనియర్ అన్న విషయాన్ని పదేపదే గుర్తు చేస్తూ?తాను ఏం చేయబోతున్నానో? చెబుతున్నారట. కన్నా లక్ష్మీనారాయణ ఎక్కడ పోటీ చేస్తే అక్కడ వ్యతిరేక వర్గాన్ని కూడగట్టైనా సరే.. ఓడిస్తానని శపథం చేస్తున్నారట. దీంతో.. ఈ వైరం టీడీపీకి ఎంత నష్టం చేస్తుందోనని ఆందోళనలో ఉన్నారట కార్యకర్తలు. అధినాయకత్వంవెంటనే చెక్ పెట్టకుంటే? కాంగ్రెస్ తరహా వర్గపోరుతో ఇద్దరు సీనియర్స్ కలిసి పార్టీకి నష్టం చేస్తారని అంటున్నారట. రాష్ట్రంలో రాజకీయం రోజు రోజుకీ మారిపోతున్న తరుణంలో ఇలాంటి కొట్లాటలను ఉపేక్షిస్తే.. మొదటికే మోసం వస్తుందని అంటున్నారట ద్వితీయ శ్రేణి నాయకులు సైతం. మరి ఈ విషయంలో టీడీపీ అగ్ర నాయకత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుంది ? కన్నా, రాయపాటి మధ్య సయోధ్య కుదర్చ గలుగుతుందా? లేదా అన్నది చూడాలి.

# రొంపికుంట పాఠశాలకు టీవీ బహుకరణ

**కమాన్ పూర్**

లయన్స్ క్లబ్ అఫ్ పెద్దపల్లి ఆధ్వర్యంలో లయన్ పోరండ్ల పరమేశ్వర్ బర్త్ డే సందర్భంగా రొంపికుంట ప్రాథమిక పాఠశాలకు 25,000/- రూపాయల విలువైన టీవీ ని బహుకరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీరజ పాఠశాల విద్యార్థులకు ఆన్లైన్ పాఠాలు బోధినీచడానికి టీవీ కావాలని లయన్స్ క్లబ్ అఫ్ పెద్దపల్లి వారి దృష్టికి తీసుకుపోగా లయన్ పరమేశ్వర్ తన బర్త్ డే సందర్భంగా ఈ రోజు పాఠశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో టీవీ ని బహుకరించడం జరిగింది. ఈ సందర్భంగా లయన్ పరమేశ్వర్ గారు మాట్లాడుతూ విద్యార్థులను అన్ని రంగాలలో ఉన్నతస్థితికి వచ్చేలా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో దాత లయన్ పరమేశ్వర్, లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ రీజియన్ చైర్మన్ లయన్ బెల్లంకొండ జయపాల్ రెడ్డి, రొంపికుంట సర్పంచ్ కటకం రవీందర్, వైస్ ఎంపీపీ ఉప్పరి శ్రీనివాస్ యాదవ్,, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మైనర్ ను గర్భవతిని చేసిన ఆటో డ్రైవర్

**తణుకు**

పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పట్టణానికి చెందిన ఏడో తరగతి చదువుతున్న బాలికను ఒక ఆటో డ్రైవర్ పలుమార్లు అత్యాచారం చేసిన వైనమిది. నిందితుడు దుర్గాప్రసాద్ బాలికను మాయమాటలతో లోబర్చుకున్నాడని పోలీసులు వెల్లడించారు. బాధితురాలి ఇంటి పక్కనే అద్దెకు ఉంటున్న దుర్గాప్రసాద్ గత మూడు నెలలుగా పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలిక ఆరోగ్యం క్షీణించడంతో తల్లి ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించింది. డాక్టర్లు బాలిక గర్భం దాల్చినట్లు వైద్యులు వెల్లడించడంతో పోలీసులకు ఫిర్యాదు చేసారు. నిందితుడు ములగాల దుర్గా ప్రసాద్ ను అదుపులోకి తీసుకున్నారు. ఫోక్సొ, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసారు. నరసాపురం డి.ఎస్.పి పర్యవేక్షణలో తణుకు పట్టణ సిఐ ముత్యాల సత్యనారాయణ దర్యాప్తు చేస్తున్నారు

## రైతులను ఆదుకుంటాం

**సిద్ధిపేట**



సిద్ధిపేట అర్బన్ మండలం నాంచారుపల్లి గ్రామంలో వడగండ్ల వానతో తీవ్రంగా దెబ్బతిన్న వరి పంటలను రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వడగండ్ల వానతో నష్టపోయిన రైతులు అధైర్య పడొద్దని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారం అందించి రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని రైతులకు మంత్రి భరోసా ఇచ్చారు. యుద్ధప్రాతిపదికన నష్టపోయిన ధాన్యం పంటల వివరాలు సేకరించాలని జిల్లా అధికార యంత్రాంగానికి మంత్రి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. క్షేత్రస్థాయిలో నష్టపోయిన పంట పరిశీలనలో మంత్రి వెంట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బీచ్ లో గర్భవతి మృతదేహం లభ్యం

**విశాఖపట్నం**



విశాఖపట్నం వైఎంసిఏ సమీపంలో బీచ్ లో అనుమానాస్పద స్థితిలో యువతి మృతదేహం లభ్యమయింది. మృతురాలు పెద గంట్యాడ కు చెందిన శ్వేతగా పోలీసులు గుర్తించారు. ఒడ్డుకు కొట్టుకు వచ్చిన యువతి మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందచేసారు. మంగళవారం అర్ధరాత్రి ఘటన వెలుగు లోకి వచ్చింది. త్రి టౌన్ పోలీసులు కేసు నమోదు చేసారు. మృతురాలు 5 నెలల గర్భవతి, కుటుంబ కలహాలతో చనిపోయినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు.

## కుండపోత వర్షానికి ధాన్యం నీటిపాలు

**యాదాద్రి**

మంగళవారం రాత్రి కురిసిన కుండపోత వర్షానికి దాన్యాం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలు పూర్తిగా తడిసిపోయాయి. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో వ్యవసాయ మార్కెట్లో తడిసి ముద్దయిన ధాన్యం కుప్పలు చూసి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు వర్షము పడ్డప్పుడు వరద నీరు వెళ్లే సరైన వసతులు లేకపోవడంతో మార్కెట్లో వర్షపు నీరు నిలిచిపోయాయి. బతుకమ్మ లా ధాన్యం కుప్పలు తేలి ఆడుతున్నాయి. వ్యవసాయ మార్కెట్ కేంద్రానికి ధాన్యాం తెచ్చిన వెంటనే కొనుగోలు చేస్తే మాకు ఈ బాధలు ఉండవని బాధితులు అంటున్నారు. పంట పండించడం ఒకలా ఉంది పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడం ఒక ఎత్తుగా తయారయింది. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలని రైతులు అంటున్నారు. తడిసిన ధాన్యాన్ని మళ్ళీ మాయిచర్ కోసం ఎండబెట్టి కూలీలకు, జేసీబీలకు ఖర్చు కర్చు అవుతుందని, ఇవేవీ లేకుండా రైతులపై దయ తలచి దాణ్యాం కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

## రైతులు ఆందోళన చెందవద్దు

**హైదరాబాద్**

రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాలు నేపథ్యంలో రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారకరామారావు తెలిపారు. దురదృష్టవశాత్తు రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల వలన రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులను పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కష్టకాలంలో రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులంతా రైతులకు భరోసా ఇవ్వాలన్నారు. రాష్ట్రంలోని పార్టీ ఎమ్మెల్యేలు, ఇతర ప్రతినిధులు అంతా క్షేత్రస్థాయిలో పర్యటించి స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితులను పర్యవేక్షించాలని కోరారు. రాష్ట్రంలోని రైతులు ఆందోళన చెందవద్దని, వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని కేటీఆర్ తెలిపారు. ఈ మద్యనే కురిసిన ఆకాల వర్షాల నేపధ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు భరోసా ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

# వచ్చేసిన కొత్త పుస్తకాలు

**విజయవాడ :**

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ఉమ్మడి కృష్ణా జిల్లాకు పుస్తకాలొచ్చాయి. 2023?24 విద్యాసంవత్సరంలో పాఠశాలలు పునఃప్రారంభ సమయానికి విద్యార్థులం దరికీ పుస్తకాలు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. విజయవాడ ఆటోనగర్‌లో ఉన్న గోడౌన్‌కి ఇప్పటికే 9 లక్షల పుస్తకాలు వచ్చాయి. మిగిలిన పుస్తకాలు దశలవారీగా గోడౌన్‌కు వస్తాయని విద్యాశాఖాధికారులు చెబుతు న్నారు. ఉమ్మడి జిల్లా అంటే కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలతో పాటు ఏలూరు జిల్లాలోని రెండు నియోజకవర్గాలకు కలిపి మొత్తం 31 లక్షల పుస్తకాలు అవసర మవుతాయని విద్యాశాఖాధికారులు తెలిపారు. ఈ పుస్తకాలన్నీ సరఫరా చేసేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. విజయవాడ ఆటోనగర్‌లోని గోడౌన్ నుంచి ఆయా మండల కేంద్రాల్లోని స్టాక్ పాయింట్లకు సకాలంలో పుస్తకాలు అందించేలా ప్రణాళిక రూపొందించారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే తేదీ నాటికి ప్రతి విద్యార్థి చేతిలో పుస్తకాలు ఉండేలా విద్యాశాఖా ధికారులు చర్యలు తీసుకుంటు న్నారు. గత ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు సకాలంలో పుస్తకాలు అందని పరిస్థితులు ఉండేవి. ప్రస్తుతం సీఎం జగన్ ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేసి దాదాపు రెండు నెలలు ముందుగానే పుస్తకాలన్నీ అందించే దిశగా చర్యలు తీసుకున్నారు. పాఠశాలలు తెరచిన రోజునే పుస్తకాలను విద్యార్థులకు అందించేలా విద్యాశాఖా ధికారులు దృష్టిసారించాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చారు.ప్రభుత్వం సరఫరా చేస్తున్న పాఠ్యపుస్తకాలపై క్యూఆర్ కోడ్‌ను కూడా ముద్రించారు. ఈ కోడ్‌ను స్కాన్ చేస్తే దీక్ష యాప్ ద్వారా సెల్‌ఫోన్, ట్యాబ్‌లలో కూడా పాఠ్యాంశాలు కనిపిస్తాయి. మిర్రర్ ఇమేజ్ పుస్తకాల ముద్రణపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. తెలుగు, ఇంగ్లిషు మీడియంలో పాఠ్యాంశాలు ఉన్నాయి. వీటి వల్ల తెలుగు మీడియం నుంచి ఇంగ్లిష్ మీడియంలో చేరిన విద్యార్థులకు ఎంతో సులభంగా ఉంటుందని ఉపాధ్యా యులు చెబుతున్నారు. 9వ తరగతికి కొత్తగా రూపొందించిన సిలబస్ మేరకు పుస్తకాలను ముద్రిస్తున్నారు. గతంలో 1 నుంచి 5వ తరగతి వరకు మూడు సెమిస్టర్ల విధానం ఉండగా ఈ సారి రెండు సెమిస్టర్లకు అనుగుణంగా పుస్తకాలు రూపొందించారు.

# వై నాట్ బీఆర్ఎస్ కర్ణాటక

**బెంగళూరు:**

ఫస్ట్ టార్గెట్ అని ప్రకటించిన కర్ణాటకలో కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీని పోటీ పెట్టలేకపోయారు. కనీసం తమ మిత్రపక్షం అని చెప్పుకుంటున్న జేడీఎస్‌కు మద్దతుగా ప్రచారానికి వెళ్తారో లేదో స్పష్టత లేదు. కేసీఆర్ కర్ణాటక విషయంలో ఎందుకు పూర్తిగా నిరాసక్తంగా ఉన్నారనేది బీఆర్ఎస్‌లోనూ హాట్ టాపిక్ అవుతోంది. ఎందుకంటే కర్ణాటకలో బీఆర్ఎస్‌కు మంచి అవకాశాలు ఉన్నాయి. హైదరాబాద్ కర్ణాటక ప్రాంతంలో ఉన్న కనీసం 30 అసెంబ్లీ స్థానాల్లో ప్రభావం చూపి ఉండేవారు. బెంగళూరులోనూ బీఆర్ఎస్ ప్రభావం ఉండేది. కానీ ఎందుకు కేసీఆర్ సైలెంట్ అయ్యారు. బీఆర్ఎస్‌తో కలిసి పని చేయడానికి జేడీఎస్ సిద్ధంగా ఉంది. ఆ పార్టీ నేత కుమారస్వామి కేసీఆర్ ఎప్పుడు పిలిచినా బీఆర్ఎస్ కార్యక్రమాల్లో పాల్గొనడానికి వచ్చేవారు. కలిసి పోటీ చేయడానికి కుమారస్వామి అంగీకారం తెలిపారు. తర్వాత ఖమ్మంలో జరిగిన ఆవిర్భావ సభలో 'రాబోయే కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తం. జేడీఎస్ కు?సంపూర్ణ మద్దతునిస్తూ ప్రచారంలో పాల్గొంటం. మన రాష్ట్ర సరిహద్దు లో ఉన్న ప్రాంతాల్లో ఆ పార్టీని గెలిపించి కు మారస్వామిని మరోసారి ముఖ్యమంత్రిని చేద్దాం. బీఆర్ఎస్ జాతీయ రాజకీయ ప్రస్థానం కర్నాటకతోనే మొదలైతది అని వ్యాఖ్యానించారు. అయితే ఆ సభకు కుమారస్వామి రాలేదు. అప్పుడే కాదు ఆ తర్వాతా రాలేదు. కేసీఆర్ కూడా వెళ్లలేదు. మహారాష్ట్రలో బీఆర్ఎస్ పార్టీ వడివడిగా అడుగులు వేస్తోంది. పార్టీ విస్తరించేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తోంది. మూడు బహిరంగసభలు పెట్టారు. కానీ కర్ణాటక ఎన్నికలపై మాత్రం ఇంత వరకూ ఎలాంటి ఆలోచనలు చేయలేదు. కేసీఆర్ అసలు బయటకు రావడంలేదు. జేడీఎస్ కూడా మద్దతు కోసం ప్రయత్నించడం లేదు. ఫస్ట్ టార్గెట్ అని ప్రకటించుకున్న కర్ణాటక ఎన్నికల్లో కేసీఆర్ ఎందుకు లైట్ తీసుకున్నారు. కర్ణాటక ఎన్నికల్లో బీఆర్ఎస్ పాత్ర అసలు ఏమీ ఉండదని స్పష్టమయింది. జేడీఎస్ సపోర్టుగా కర్ణాటకలో అడుగుపెడదామనుకున్న బీఆర్ఎస్ కూడా చొరవ చూపడం లేదు. అయితే కుమారస్వామి మాత్రం కేసీఆర్ పై వ్యతిరేక ప్రకటనలు చేయడం లేదు. ఆయన మా మార్గదర్శి అని చెబుతున్నారు. ఇప్పుడు బీఆర్ఎస్ ప్రస్తావన లేకుండా జేడీఎస్ రాజకీయం చేస్తోంది. హైదరాబాద్ కర్ణాటక ప్రాంతంలో మొత్తం 31 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. బీఆర్ఎస్ పోటీ చేస్తే గెలవకపోయినా మంచి ఓట్లు సాధించే అవకాశం ఉంది. రాజకీయాలపై ప్రకాష్ రాజ్‌కు ఎంతో ఆసక్తి . కేసీఆర్ టీఆర్ఎస్ పార్టీని బీఆర్ఎస్‌గా మార్చాలనుకున్నప్పుడు ప్రతి సమావేశంలోనూ సినీ నటుడు ప్రకాష్ రాజ్ కనిపించేవారు. ఓ సారి ప్రశాంత్ కిషోర్ తోనూ సమావేశం అయ్యారు. ప్రకాష్ రాజ్ కన్నడిగుడు కావడం అక్కడ ఆయనకు రాజకీయంగానూ కొంత ఇమేజ్ ఉండటంతో బీఆర్ఎస్ తరపున ప్రకాష్ రాజ్ అక్కడ పార్టీని లీడ్ చేస్తారేమో అనుకున్నారు. అయితే అనూహ్యంగా ప్రకాష్ రాజ్ సైలెంట్ అయిపోయారు. ప్రస్తుతం ప్రకాష్ రాజ్ కర్ణాటక ఎన్నికల్లో ఏ పార్టీకీ పని చేయడం లేదు కానీ బీజేపీ కి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో జస్ట్ ఆస్కింగ్ పేరుతో బీజేపీపై విమర్శలు చేస్తున్నారు. ఆయనను బీఆర్ఎస్ చీఫ్ గా చేసినా .. కర్ణాటకలో పార్టీ ఉనికి గట్టిగా నిలబడేదన్న అభిప్రాయం ఉంది. కానీ కేసీఆర్ మిస్టరీ పాలిటిక్స్‌లో భాగంగా సైలెంట్ పోయారు.

# కమలంతో కలిసి అడుగులు

**విజయవాడ:**

ప్రత్యేకహోదా విషయంలో మాత్రమే విబేధించాం.. ఇక అన్ని విషయాల్లోనూ మోదీ విధానాలను సమర్థిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నేరుగా ప్రకటించారు. అంతే కాదు ఎన్డీఏలో చేరిక విషయంలో కాలమే నిర్ణయిస్తుందని చెప్పారు. అంటే... ఖచ్చితంగా ఆయన ఖండించలేదు. చాన్స్ ఉందన్నట్లుగా చెప్పారు. తన వైపు నుంచి ఆయన సంకేతాలు పంపినట్లుగానే భావించవచ్చని రాజకీయవర్గాలు చెబుతున్నాయి. భారతీయ జనతా పార్టీకి ఎలా స్పందిస్తుందనేది ఇప్పుడు కీలకం కావొచ్చు. ఎందుకంటే.. ఏపీలో ఏ పార్టీ ఎన్ని సీట్లు గెలిచినా చివరికి బీజేపీకే మద్దతుగా నిలుస్తుంది. కానీ టీడీపీతో ఉండే అడ్వాంటేజ్ ఏమిటంటే నేరుగా అలయెన్స్ కలుపుకోవచ్చు. వైఎస్ఆర్‌సీపీతో అలాంటి అవకాశం ఉండదు. 2019 ఎన్నికల్లో పరాజయం తర్వాత చంద్రబాబు భారతీయ జనతా పార్టీ విషయంలో పూర్తిగా సైలెంట్ అయ్యారు. ప్రత్యేకహోదా, రాష్ట్ర ప్రయోజనాల విషయంలో తాను బీజేపీపై తీవ్రంగా పోరాడినా ప్రజల మద్దతు లభించలేదు. దీంతో తన స్ట్రాటజీ తప్పు అయిందని డిసైడయ్యారు. ఆ తర్వాత సైలెంట్ అయ్యారు. జాతీయ రాజకీయాల జోలికి కూడా వెళ్లలేదు. ముందుగా తన పార్టీకి పూర్వ వైభవం తెప్పించుకునేందుకు కష్టపడుతున్నారు. వైసీపీతో మాత్రం తెగించి పోరాడుతున్నారు. మరో వైపు చూడటం లేదు. అదే సమయంలో ఎన్నికలు ఫెయిర్‌గా జరిగితేనే విజయం లభిస్తుందన్న నమ్మకంతో ఉన్నారు. అలా జరగాలంటే బీజేపీ మద్దతు ముఖ్యమనుకుంటున్నారు. అందుకే చంద్రబాబు బీజేపీ విషయంలో సానుకూలంగా ఉంటున్నారని చెబుతున్నారు. అందుకే టీవీచానల్ చర్చ తర్వాత ..గ్యాప్ పిల్ చేసుకోవడానికి అవకాశం కల్పించారంటూ ఇంగ్లిష్ చానల్‌కు కృతజ్ఞతలు కూడా చెప్పారు. ఆంధ్రప్రదేశ్ విషయం వరకూ వస్తే భారతీయ జనతా పార్టీ .. వైఎస్ఆర్‌సీపీతో కలిసి ఉందన్న అభిప్రాయం జనాల్లో ఎక్కువగా ఉంది. బీజేపీ నేతలు కూడా అదే విషయాన్ని చెబుతున్నారు. కానీ వైసీపీతో తాము లేమని ఆ పార్టీపై యుద్ధం ప్రకటిస్తున్నామని రెండు రోజుల కిందటే కార్యవర్గ సమావేశంలో ప్రకటించారు. వారు యుద్ధం చేస్తారా లేదా అన్న సంగతి పక్కన పెడితే.. ఆ పార్టీతో నేరుగా పొత్తులు పెట్టుకునే అవకాశం లేదు. బీజేపీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా వైఎస్ఆర్‌సీపీ అంగీకరించకపోవచ్చని రాజకీయవర్గాలు చెబుతున్నాయి. దీనికి కారణం ఆ పార్టీ కోర్ ఓట్ బ్యాంక్ అసంతృప్తికి గురయ్యే అవకాశం ఉండటమే. పరోక్షంగా పూర్తి స్థాయిలో సహకారం అందించేందుకు సిద్దంగా ఉంటారు. కానీ టీడీపీకి మాత్రం పొత్తులు పెట్టుకునే వెసులుబాటు ఉంది. టీడీపీ ప్రస్థానంలో బీజేపీతో పలుమార్లు కలిసింది. టీడీపీతో పొత్తు బీజేపీకి చాలా సార్లు కలసి వచ్చింది. టీడీపీతో కూటమి కట్టడం వల్ల గతంలో బీజేపీకి కేంద్రంలో అధికారం కూడా దక్కింది. అయితే ఏపీకి సంబంధించినంత వరకూ ఓటు బ్యాంక్ పరంగా చూసుకుంటే రాజకీయ పార్టీలు ఒకరితో ఒకరు పొత్తులు పెట్టుకోవాల్సిన అవసరం లేదు. ఒక్క జనసేన కలిస్తే చాలని టీడీపీ అనుకుంటోంది. ఎన్డీఏలో ఇప్పుడు నమ్మకమైన మిత్రులు ఎవరూ లేరు. బీజేపీకి పూర్తి మెజార్టీ ఉంది కాబట్టి ఎన్డీఏ అనేది ఉనికిలో ఉంది కానీ.. పెద్దగా ప్రచారంలోకి రావడంలేదు. కానీ వచ్చే ఎన్నికల తర్వాత పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పడం కష్టం. ఉత్తరాది రాష్ట్రాల్లో ముఖ్యంగా హిందీ రాష్ట్రాల్లో బీజేపీ సాధిస్తున్న ఏకపక్ష ఫలితాలతోనే రెండు సార్లు బీజేపీ అధికారంలోకి వచ్చింది. ఈ సారి ఏ కొద్దిగా తేడా పడినా ఇబ్బంది పడుతుంది. అందుకే సౌత్ నుంచి నమ్మకమైన మిత్రులు ఆ పార్టీకి అవసరం. వైఎస్ఆర్‌సీపీ ప్రాధాన్యాలు వేరుగా ఉంటాయి. నేరుగా కలవదు..ఎన్నికలైన తర్వాత మద్దతు కూడా.. ఖచ్చితంగా అవసరం అయితే అ పార్టీ ఈక్వేషన్స్ వేరుగా ఉంటాయి. అదే టీడీపీ అయితే నేరుగా ఎన్డీఏలో చేరిపోతుంది. అందుకే బీజేపీ , టీడీపీ విషయంలో కాస్త సాఫ్ట్ గా ముందుకెళు తున్నాయన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఇటీవల అండమాన్‌లో మేయర్ పోస్టును పొత్తులో భాగంగా టీడీపీకి కేటాయించి బీజేపీ. అక్కడ టీడీపీకి ఉంది రెండే రెండు సీట్లు. అయినా మేయర్ సీటి? ఇచ్చింది. బీజేపీ అధ్యక్షుడు నడ్డా ట్విట్టర్‌లో టీడీపీ, బీజేపీ కూటమికి శుభాకాంక్షలు అని ప్రకటించేశారు. కీలకమైన రాష్ట్రాల్లో కూడా అలాంటి ఆలోచన ఉండబట్టే ఇలా హైలెట్ చేశారన్న చర్చ అప్పట్నుంచి జరుగుతోంది. అందుకే ముందు ముందు కొన్ని కీలక నిర్ణయాలు రాజకీయంగా వెలువడే అవకాశాలు ఉన్నాయంటున్నారు.

## యువకుడి ఆత్మహత్య

**అనకాపల్లి**



అనకాపల్లి జిల్లాఅనకాపల్లి మండలం దిబ్బపాలెం గ్రామంలో 20 సంవత్సరాల పెంటకోట మధు కిరణ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు.అయితే, యువకుడి ఆత్మహత్య కేసులో కొత్త కోణం బయటపడింది. క్రికెట్ బెట్టింగ్ కారణంగానే ఆత్మహత్య చేసుకున్నాడని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తల్లి ఫిర్యాదుతో అనకాపల్లి రూరల్ పోలీసులు విచారణ ప్రారంభించారు. విశాఖ కేజిహెచ్ మార్చురీలో యువకుడి మృతి దేహాన్ని భద్రపరిచారు.

## మార్గదర్శిపై ఎవరితోనైనా చర్చకు సిద్ధం

**రాజమండ్రి**

మార్గదర్శి చిట్ ఫండ్ వ్యవహారంలో ఎవరితోనైనా చర్చకు సిద్దమని మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్ కుమార్ అన్నారు. బుధవారం అయన మీడియాతో మాట్లాడారు. మార్గదర్శి అక్రమాలపై వచ్చే నెల 10 తర్వాత చర్చకు వస్తా.మార్గదర్శిని సపోర్ట్ చేస్తున్న టీడీపీతోనూ చర్చకు సిద్దమని అన్నారు. రామోజీ రావు సమక్షంలోనైనా చర్చకు సిద్దమని అన్నారు. రామోజీని చంద్రబాబు ఒప్పించి చర్చలో పాల్గొనేలా చేయాలి. టీడీపీ కార్యాలయంలో చర్చ పెట్టినా నేను వస్తా. ఛాలెంజ్ చేసిన వాళ్ళు చర్చకు వస్తే నేను రెడీ అని అయన అన్నారు.

## రిమాండ్ ఖైదీ అనుదీప్ కి కరోనా పాజిటివ్

**ఏలూరు**



ఏలూరు జిల్లా పెదపాడు మండలం దుగ్గిరాల గ్రామంలో జేఎన్టీయూ ఇంజనీరింగ్ విద్యార్థి హత్యాచారం ఘటనలో నిందితుడు అనుదీప్ ను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. నిందితుడిని రిమాండ్ కు తరలించే క్రమంలో వైద్య పరీక్షల నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు నిందితుడిని పరీక్ష చేసి అతనికి కోవిడ్ సోకిందని తెలిపారు. దీంతో అతనిని అరెస్టు చేసే క్రమంలో అతనికి దగ్గరగా ఉన్న కొందరి పోలీస్ సిబ్బందిలో భయాందోళనలు మొదలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. ఏలూరు జిల్లా పెదవేగి మండలం దుగ్గిరాల గ్రామానికి చెందిన అనుదీప్ క్తి ఈనెల పదో తేదీన యువతిని నిర్బంధించి ఆమెను గాయపరిచి పలుమార్లు అత్యాచారం పాల్పడిన ఘటనలో నిందితుడు. పోలీసులు నిందితుడు అనుదీప్ ను 24 గంటల వ్యవధిలో పోలీసులు పట్టుకుని అతని అరెస్టు చేసారు.. ఏలూరు నగరంలోని ఏలూరు పోలీస్ స్టేషన్లో సోమవారం రాత్రి ఏలూరు దిశ మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ కె వి సత్యనారాయణ విలేకరి సమావేశం ఏర్పాటు చేసి నిందితున్ని రిమాండ్కు తరలించే క్రమంలో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి వైద్య పరీక్షలు నిమిత్తం తరలించగా నిందితుడికి కోవిడ్ సోకినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో నిందితుడిని రిమాండ్ కు తరలించకుండా కరోనా వైద్య సేవల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రిలోనే చేర్చారు. విషయం తెలుసుకున్న కొంతమంది పోలీసు అధికారులు ఆందోళనలో పడ్డారు. కొంతమంది పోలీసు సిబ్బంది కోవిడ్ పరీక్షలు చేయించుకున్నట్లు సమాచారం.

## దివ్యాంగులకు ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలి

**బద్వేలు**

బద్వేలు పట్టణం పరిసర ప్రాంతాలలో నివాసం ఉండే అర్హులైన ప్రతి ఒక్క దివ్యాంగుడికి మూడు సెంట్లు ఇంటి స్థలముతో కూడిన కాలనీ ఏర్పాటు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఆర్గనైజేషన్ సెక్రెటరీ అడిగ వెంకటరమణ ప్రభుత్వాన్ని కోరారు బుధవారం నాడు దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో బద్వేలు తహసిల్దారు మధుసూదన్ రెడ్డి గారికి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా డి హెచ్ పి ఎస్ ఆర్గనైజేషన్ సెక్రటరీ పడిగే వెంకటరమణ మాట్లాడుతూ పుట్టినప్పటి నుండి సహజమైన వికలత్వంతో మరియు ప్రమాదాలు గురై వికలత్వం పొందిన, నిరాశ్రయులైన వికలాంగులను పాలక ప్రభుత్వం ఆదుకొని వారికి ఆసరా కల్పించవలసిన బాధ్యత ఉందని ఆయన పేర్కొన్నాడు. కనుక జిల్లా కలెక్టర్ మరియు బద్వేల్ ఆర్డిఓ తమ సిబ్బంది అయినా తాసిల్దారులకు ఆర్డర్ ఇచ్చి ప్రతిభావంతులను గుర్తించి వారికి పట్టాలు మంజూరు చేసి ,ఇల్లు కట్టించి క వికలాంగుల కాలనీ ఏర్పాటుకు సహకరించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డి హెచ్ పి ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పెంచలయ్య, డి హెచ్ పి ఎస్ పట్టణ కార్యదర్శి కే సుబ్బరాయుడు, మునిరత్నం, రమణ, ఏఐటియుసి నాయకులు నాగేష్, వికలాంగ నాయకులు ముత్యాల రమణయ్య,కదిరుల్ల, ఖాదర్ బాషా, రాజారెడ్డి ,శ్రీకాంత్ రెడ్డి, డి బిఎఫ్ నాయకులు చిన్నయ్య, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కరెంట్ తీగ తగిలి వ్యక్తి మృతి

**బద్వేలు**

బద్వేల్ పట్టణం విద్యానగర్లో మంగళవారం రాత్రి విద్యుత్ ఘాతంతో గోపయ్య 50 అనే వ్యక్తి మృతి చెందాడు నిర్మాణంలో ఉన్న భవనం లోని రెండవ అంతస్థకు వెళ్లిన ఈయనకు ప్రమాదవశాత్తు కరెంట్ తీగ తగలడంతో మృతి చెందాడు ఇంటికి ఆధారమైన పెద్దదిక్కు పోవడంతో ఆ కుటుంబం తల్లడిల్లుతుంది గోపయ్య మృతికి బద్వేల్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గోపాల స్వామి నివాళులు అర్పించారు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు

ప్రజాతపన prajathapana.com

# అధికారమే లక్ష్యంగా బీజేపీ వ్యూహాలు

**హైదరాబాద్ :**

తెలంగాణలో ఈసారి బీజేపీ ప్రభుత్వం" అనే ట్యాగ్ లైన్ తో బీజేపీ పావులు కదుపుతోంది. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అన్ని ఏర్పాట్లు చేసుకుంటోంది. ఇందులో భాగంగానే తెలంగాణ వ్యాప్తంగా గోడలపై కమలం పువ్వు గుర్తు, ఎన్నికల ట్యాగ్ లైన్ తో రాతలు రాయిస్తోంది. ప్రతీ పోలింగ్ బూత్ పరిధిలో కనీసం ఐదు చోట్ల వాల్ రైటింగ్ కార్యక్రమం చేపట్టింది. రాష్ట్రంలో ఒకే ఫార్మాట్ లో వాల్ రైటింగ్ చేయాలని పార్టీ అధిష్టానం ఆదేశించింది. ఈ క్రమంలోనే పలు చోట్ల గోడలపై రాతలు రాయించే కార్యక్రమం చేపట్టారు. గోడలపై.. తెలంగాణలో ఈసారి బీజేపీ ప్రభుత్వం అంటూ రాస్తుండడంతో రాజకీయ హీట్ మరంత పెరిగింది. ఎన్నికలకు ఎనిమిది నెలల ముందే బీజేపీ పార్టీ ఈ రేంజ్ లో ప్రణాళికలు రూపొందిస్తుండడంతో మిగతా పార్టీలు కూడా సన్నాహాలు మొదలు పెట్టాయి. మరోవైపు వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ సంపూర్ణ మెజారిటీతో గెలుస్తుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. రెండ్రోజుల క్రితం చేవెళ్ల బహిరంగ సభలో ముస్లిం రిజర్వేషన్లపై అమిత్ షా సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్ రద్దు చేస్తామన్నారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రావాలని ఢిల్లీలో ప్రధాని మోదీకి వినిపడేలా నినదించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 9 ఏళ్లుగా బీఆర్ఎస్ అవినీతి పాలన చేస్తుందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో కాషాయ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. పేపర్ లీకేజీ వ్యవహారంపై మాట్లాడిన అమిత్ షా... ఏ తప్పు చేయకుండా బండి సంజయ్ అరెస్టు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ అరెస్టులకు బీజేపీ ఎప్పుడూ భయపడదన్నారు. “ తెలంగాణలో యువతకు అన్యాయం జరుగుతోంది. ఏ పరీక్ష పెట్టినా పేపర్ లీక్ అవుతోంది. పేపర్ లీకేజీలపై ఇప్పటి వరకు సీఎం కేసీఆర్ స్పందించలేదు. పేపర్ లీక్ ఘటనలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నాను. తెలంగాణలో ఉద్యోగాల భర్తీ జరగడం లేదు. రాష్ట్రంలో కేంద్ర పథకాలు ప్రజలకు చేరడం లేదు. కేసీఆర్ ఎన్ని కుట్రలు చేసినా ప్రజలను మోదీ నుంచి దూరం చేయలేరు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ సంపూర్ణ మెజారిటీతో గెలుపొందడం ఖాయమని ఈ మహాసభ తెలియజేస్తోంది. బీఆర్ఎస్ అవినీతి పాలన అంతం కావడానికి కౌంట్ డౌన్ మొదలైంది. కేసీఆర్ మీ దౌర్జన్యాలకు ప్రజలు భయపడరు, ఇప్పుడు మిమ్మల్ని గద్దె దించే వరకు వారి పోరాటం కొనసాగుతుంది. జాగ్రత్తగా వినండి కేసీఆర్! దురదృష్టవశాత్తు తెలంగాణలో, పోలీసు, పరిపాలన పూర్తిగా రాజకీయకోణంలో జరుగుతోంది. మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు మధ్యలోనే ఆపేస్తున్నారు. రాష్ట్ర ప్రజలకు సంక్షేమం అభివృద్ధిని దూరం చేస్తున్నారు. “- అమిత్ షా

# డ్రెస్సింగ్ రూమ్‌లో ట్రంప్ నాపై బలవంతంగా అత్యాచారం చేశాడు

**కోర్టులో సాక్ష్యం చెప్పిన కాలమిస్ట్ కారోల్**

**న్యూయార్క్ :**

అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పై మరో లైంగిక వేధింపుల కేసు కోర్టులో విచారణకు వచ్చింది. డ్రెస్సింగ్ రూమ్‌లో డొనాల్డ్ ట్రంప్ తనపై అత్యాచారం చేశాడని అమెరికన్ కాలమిస్ట్ ఇ.జీన్ కారోల్ తాజాగా యూఎస్ కోర్టులో సాక్ష్యం చెప్పారు. తనపై అత్యాచారం చేయడమే కాకుండా తన పరువుకు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేశారని యూఎస్ కోర్టులో కారోల్ పేర్కొన్నారు. “మాన్‌హట్టన్‌లోని ఫిఫ్త్ అవెన్యూలోని బెర్గ్‌డార్ఫ్ గుడ్‌మాన్ డిపార్ట్‌మెంట్ స్టోర్‌లో డ్రెస్సింగ్ రూంలో డొనాల్డ్ ట్రంప్ నాపై అత్యాచారం చేశాడు” అని కారోల్ కోర్టులో జడ్జి ముందు చెప్పారు. అంతకు ముందు తనను మహిళల



లోదుస్తుల కొనుగోలుపై ట్రంప్ సలహా అడిగి, ఆపై లైంగిక దాడికి పాల్పడ్డాడని కారోల్ వివరించారు. తన కంటే రెండింతల పరిమాణం ఉన్న ట్రంప్ డ్రెస్సింగ్ రూంలోపల ఉన్న క్షణంలో అంతా మారిపోయిందని కారోల్ చెప్పారు.
అనంతరం తన పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలతోపాటు తనను ఎగతాళి చేశాడని మాజీ అధ్యక్షుడు ట్రంప్ పై యూఎస్ సివిల్ కోర్టు విచారణలో ఆమె ఆరోపించారు. పోర్న్ స్టార్‌కి ట్రంప్ డబ్బు చెల్లింపునకు సంబంధించిన నేరారోపణలపై ట్రంప్ పై విచారణ జరిపిన కొద్ది వారాల తర్వాత కారోల్ కేసు విచారణకు వచ్చింది. లైంగిక వేధింపులకు గురైన బాధితులు... దాడులు జరిగిన దశాబ్దాల తర్వాత వారు దావా వేయడానికి వీలుగా న్యూయార్క్‌లో గత ఏడాది నవంబర్‌లో కొత్త చట్టం అమలులోకి వచ్చింది. దీంతో కారోల్ తరఫు న్యాయవాదులు కొత్త దావాను దాఖలు చేశారు.
డొనాల్డ్ ట్రంప్ 2024లో రెండవసారి అధ్యక్ష పదవికి పోటీ చేయనున్న నేపథ్యంలో ఆయన చట్టపరమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారు. డొనాల్డ్ ట్రంప్ పోర్న్ స్టార్ స్టార్మీ డేనియల్స్‌కు చేసిన డబ్బు చెల్లింపునకు సంబంధించిన క్రిమినల్ ఆరోపణలను ఎదుర్కొన్నారు.

# మహారాష్ట్రలో 3 సభలకు బీఆర్ఎస్ 10 కోట్ల ప్రచార వ్యయం

**హాజరయ్యే జర్నలిస్టులకు రాచమర్యాదలు-**

**నగదు పంపకం**

**మరఠ్వాడాలో హాట్‌టాపిక్‌గా గులాబీసభలు**

**హైదరాబాద్ :**

జాతీయ పార్టీగా తన ఉనికిని బలంగా చాటుకునే ప్రయత్నాల్లో ఉన్న బీఆర్ఎస్.. మహారాష్ట్రలో మీడియాపై వరాల జల్లు కురిపిస్తోంది! అక్కడి ప్రముఖ పత్రికల్లో కవరేజీ కోసం పాత్రికేయులకు రాచమర్యాదలు చేస్తూ.. పత్రికలకు వాణిజ్య ప్రకటనలు గుప్పిస్తూ.. ఫస్టు పేజీలో, పతాకశీర్షికల్లో వార్తల కోసం పరితపిస్తోంది!! టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎ?సగా మారినప్పటి నుండి ఆ పార్టీ మహారాష్ట్రపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్న సంగతి తెలిసిందే. అయితే, అక్కడ తమకు ఎలాంటి పట్టూ లేకపోవడంతో.. ప్రజల్లోకి బలంగా తన వాణి వెళ్లేందుకు మీడియాపై ఆధారపడుతోంది. ఈ క్రమంలో అక్కడ ఇప్పటివరకూ ఏర్పాటు చేసిన బహిరంగ సభలకు మీడియా ప్రచారం కోసమే బీఆర్ఎస్ పార్టీ సుమారు రూ.10 కోట్ల దాకా ఖర్చు చేయగా.. వాటిలో ప్రధాన పత్రికలకే రూ.5 కోట్ల దాకా వాణిజ్య ప్రకటనలు, ఇతర ఖర్చుల రూపంలో ఇచ్చినట్లు సమాచారం.
ప్రధాన పత్రికల్లో యాడ్స్ ఎడాపెడా ఇస్తుండడంతో.. బీఆర్ఎస్ బహిరంగ సభల వార్తలు బ్యానర్‌గా




వస్తున్నాయి. సభకు ముందు నేతలు నిర్వహించే ప్రెస్‌మీట్లను కూడా మొదటి పేజీలో ప్రధానంగా ప్రచురిస్తున్నారు. సాధారణంగా మన దగ్గర మొదటి పేజీలో శీర్షికలు, వార్తలో ప్రధానాంశాలు, కొంతమేరకు వార్త ఉంటాయి. కానీ మహారాష్ట్రలో మొదటి పేజీలో పెట్టే ఏ వార్తాకథనమైనా పూర్తిగా వస్తుంది. దీంతో జనం దాన్ని పూర్తిస్థాయిలో చదువుతారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలా బ్యానర్ వార్తగా వేయించుకోగలిగితే.. కేసీఆర్ ప్రసంగం పూర్తిస్థాయిలో ప్రజల్లోకి వెళ్తుందని బీఆర్ఎస్ నేతలు భావించడమే అక్కడి మీడియాపై ఈ ప్రేమకు కారణం. భారీ సర్క్యులేషన్ ఉన్నవి.. మధ్యస్థ, చిన్న పత్రికలకు వాటి స్థాయిని బట్టి అడ్వర్టైజ్‌మెంట్లలో ప్రాధాన్యమిస్తున్నారు. అలాగే.. ప్రెస్‌మీట్లకు, సభలకుహాజరయ్యే జర్నలిస్టులకు రాచమర్యాదలు చేస్తున్నట్లు.. పత్రికల యాజమాన్యాలతోనూ తరచూ సంప్రదింపులు జరిపేందుకు ప్రత్యేక ప్రతినిధులను కూడా నియమించినట్లు తెలుస్తోంది.

**ప్రధాన పత్రికల జర్నలిస్టులకు ఒక్కొక్కరికి రూ.25 వేలు**

ఈ సభలకు జనం తరలింపునకు మండలాల వారీగా నేతలకు డబ్బు ముట్టజెప్పడంతో పాటు బహిరంగ సభ కవరేజికి వచ్చే ప్రధాన పత్రికల జర్నలిస్టులకు ఒక్కొక్కరికి రూ.25 వేలు, అలాగే చిన్న పత్రికల జర్నలిస్టులకు రూ.10వేల చొప్పున ఆఫర్ చేసినట్లు సమాచారం. అలాగే.. మండల స్థాయి జర్నలిస్టుల రాచమర్యాదల కోసం రూ.5 లక్షలను కేటాయిస్తూ జోరుగా ప్రచారానికి దిగుతున్నట్లు తెలుస్తోంది. కారణమేదైనా బీఆర్ఎస్ ఇస్తున్న ఆఫర్లు చూసి మహారాష్ట్ర జర్నలిస్టులు ఆశ్చర్యపోతున్నట్లు చెబుతున్నారు. ఇతర రాష్ట్రాల్లోనూ..మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాలపైనా బీఆర్ఎస్ దృష్టి సారించింది. ముఖ్యంగా ఢిల్లీ, పంజాబ్ లాంటి రాష్ట్రాల్లోనూ జోరుగా ప్రచారం చేస్తోంది. అక్కడి ప్రధాన పత్రికలకు లక్షల్లో యాడ్స్ ఇస్తూ ప్రచారం చేసుకుంటోంది. ఎక్కువ ధరైనా సరే.. ఫ్రంట్ పేజీలో, కలర్‌లోనే వాణిజ్యప్రకటనలు వేయిస్తోంది. మహారాష్ట్రలో బహిరంగ సభలు నిర్వహించే రోజుల్లో.. ఢిల్లీ, పంజాబ్ పత్రికల్లోనూ బీఆర్ఎస్ వాణిజ్య ప్రకటనలు ఇస్తోంది. కేవలం మీడియాతో సంప్రదింపులు జరిపేందుకే ప్రత్యేకంగా కొంత మంది ప్రజా ప్రతినిధులను నియమించుకుని బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం.

# గుత్తేదారుడు నిర్లక్ష్యంతో బాలుడు మృతి

**అరకు**

గుత్తేదారుడు నిర్లక్ష్యంతో అల్లూరి సీతారామరాజు జిల్లాలో విషాదం చోటుచేసుకుంది..వివరాలు ఇలా ఉన్నాయి..హుకుంపేట మండలంలోని ఇటీవల కాలంలో హైవే రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి.అయితే గుత్తేదారుడు నిర్లక్ష్యంతో రోడ్డు కిరువైపులా కల్వర్టులు తీయకుండా విడిచి పెట్టేయడంతో కురుస్తున్న అకాల వర్షాలకు రోడ్డుకు చుట్టుపక్కల నీటినిలువతో చెరువుల్లా మారాయి.దీనితో హుకుంపేట గ్రామానికి చెందిన కొంతమంది చిన్నారులు మధ్యకాలంలో ఎండ తీవ్రతకు సేద తీరేందుకు వెళ్లి ఈతకు అలవాటు పడ్డారు.అయితే హుకుంపేట గ్రామానికి చెందిన 5వ తరగతి చదువుతున్న మజ్జి.జ్ఞానదీప్ మంగళవారం 2 గంటల సమయంలో అదే ఆ వాగులో ఈతకు వెళ్లి అదృశ్యమయ్యాడు. కుటుంబీకులు రోజంతా వెతికిన జ్ఞానదీప్ ఆచూకీ దొరకలేదు.అయితే మండలానికి చెందిన కొందరు మహిళలు బుధవారం ఉదయం ఘటన స్థలంలో సమీపంలోని పొలాల్లో బాలుడి చెప్పులు బట్టలు ఉండటాన్ని గమనించి బాలుడి కుటుంబీకులకు తెలియజేశారు.దీనితో బాలుడి తండ్రి కృష్ణ వార్డు సభ్యుడు వెంకటేష్ గ్రామస్తులు గాలించడంతో హైవే రోడ్డు పక్కన వాగులో బాలుడు శవమై తేలాడు.బాలుడి జ్ఞానదీప్ మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. గ్రామస్తులు మాట్లాడుతూ.. హైవే నిర్మాణ గుత్తేదారుడు రోడ్డు నిర్మాణం జరిగేటప్పుడు రోడ్డుకు ఇరువైపులా నిలువ ఉన్న నీరు పోవడానికి తాత్కాలికంగా కల్వర్టు గాని మోటర్ గాని పెట్టి నీళ్లను ఎప్పటికప్పుడు తోడకుండా ఉండడంతో అవి చెరువుల్ల తయారయ్యాయని కనీసం హైవే నిర్మాణం జరుగుతున్న ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు కూడా పెట్టకపోవడంతో తమ బాలుడు మృత్యువాత పడ్డాడని ఆరోపించారు.తమ బాలుడికి మృతికి కారకుడైన హైవే రోడ్డు నిర్మాణ గుత్తేదారుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.హైవే రోడ్డు నిర్మాణ గుత్తేదారుడుపై చర్యలు తీసుకునేంతవరకు బాలుడి మృతదేహాన్ని సంఘటన స్థలంలోని ఉంచుతామని తల్లిదండ్రులు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ ఘటనపై స్థానిక పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# భారీ వర్షాలతో గోడకూలి 8 నెలల పసిపాప మృతి

**హైదరాబాద్**

‘ఇంకా నాలుగు రోజులైతే చాలు.. ఆ ఇళ్లు ఖాళీ చేసే వాళ్లం.. మా పాప ప్రాణాలు దక్కేవి’ అంటూ.. విధి వక్రీకరించి చిన్నారి తమకు దక్కకుండా పోయిందని బోరున విలపించారు బంధువులు. హైదరాబాద్ బోరబండలోని రహమత్‌నగర్‌లో ఉన్న కార్మికనగర్‌లో నిన్న రాత్రి కురిసిన వర్షాల కారణంగా గోడకూలి 8 నెలల పాప జీవనిక మృతి చెందిన ఘటన కాలనీ వాసులను కన్నీటి పర్యంతం చేసింది.గాలి-వాన బీభత్సం ఓ చిన్నారి ప్రాణాలు బలిగొంది. హైదరాబాద్ రహ్మత్‌నగర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. పక్కనున్న భవనంపై నుంచి రెయిలింగ్ కూలి రేకులషెడ్డుపై పడింది. ఇంటిలో నిద్రిస్తున్న పాప స్పాట్‌లోనే చనిపోయింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. హైదరాబాద్ రహ్మత్‌నగర్‌లోని కార్మికనగర్‌లో చిన్నారి జీవనిక మృతి చెందిన ఘటన అందర్నీ కలిచివేస్తోంది. పొట్ట చేత పట్టుకొని హైదరాబాద్ వచ్చిన ఆ దంపతులకు తీరని విషాదం నింపింది. రాత్రి కురిసిన భారీవర్షం ఆ కుటుంబాన్ని శోకసంద్రంలో ముంచెత్తింది. అల్లారు ముద్దుగా పెంచుకున్న పసికూన, కళ్లముందే కాటికి వెళ్లిపోవడం ఆ దంపతులు జీర్ణించుకోలేకపోతున్నారు .మెదక్‌జిల్లా నారాయణఖేడ్‌కి చెందిన శ్రీకాంత్ జగదేవి దంపతులు బ్రతుకు దెరువుకోసం హైదరాబాద్ వచ్చి కూలిపని చేసుకుంటూ బోరబండ సమీపంలోని రహమత్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. నిన్న రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం పడటంతో పక్కనే ఉన్న నాలుగో అంతస్థ బిల్డింగ్ రెయిలింగ్ కూలి, పక్కనే ఉన్న రేకులషెడ్డుపై కూలింది. ఇంట్లో నిద్రిస్తున్న పాపపై శిథిలాలు పడటంతో పాప జీవనిక ప్రాణాలు వదిలింది.‘ఇంకా నాలుగు రోజులైతే చాలు.. ఆ ఇళ్లు ఖాళీ చేసే వాళ్లం.. మా పాప ప్రాణాలు దక్కేవి.. విధి వక్రీకరించి చిన్నారి తమకు దక్కకుండా పోయింది’ అంటూ బోరున విలపించారు జీవనిక నాన్నమ్మ. తమకు న్యాయం చేయాలని కోరుతోంది. కాగా, ప్రమాదం జరిగినప్పుడు పాప జీవనిక మాత్రమే ఆ ప్లేస్‌లో ఉంది. పెద్దపాప, తల్లిదండ్రులంతా బయటే ఉన్నారు. ఒకవేళ అందరూ కలిసి నిద్రిస్తున్న సమయంలో ఘటన జరిగి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేదని జీవనిక తల్లి చెబుతోంది.ఘటనా స్థలాన్ని స్థానిక కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పరిశీలించారు. పాప తల్లిదండ్రులను పరామర్శించారు. జీహెచ్ఎంసీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. పాప కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఇక, రహమత్‌నగర్ కార్మికనగర్‌లో రెయిలింగ్ బిల్డింగ్స్ చాలానే ఉన్నాయి. ఏ ఒక్కదానికి పర్మిషన్ లేకున్నా..ఇంటి అద్దెలకోసం మూడు, నాలుగు ఫ్లోర్‌లు వేసి వదిలిపెట్టారు. సిమెంట్ సీల్ చేయకుండానే ఇటుకలు పేర్చి అలానే వదిలేశారు. గట్టిగా గాలివాన వస్తే రెయిలింగ్ కూలి పక్కనున్న ఇళ్లపై పడి ప్రమాదానికి కారణమవుతున్నారు.

# తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

**మంథని**

మంథని మున్సిపల్ పరిధిలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకుడు దుద్దిళ్ళ శ్రీనుబాబు సందర్శించారు. మార్కెట్ యార్డ్ చుట్టూ తిరిగి తడిసిన వడ్ల నిల్వలను పరిశీలించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకుని రైతులకు ధైర్యాన్ని చెప్పారు. ఈ సందర్భంగా శీను బాబు మాట్లాడుతూ అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనాలని కాంటలను ఏర్పాటు చేసి తక్షణమే రైతులకు న్యాయం చేసేలా ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. రైతులకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని అన్నారు.



తాలు పేరుతో బస్తాకు ఒక గింజ కూడా ఎక్కువ తీసుకోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ముస్కుల సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సేగ్గం రాజేష్,పొలు శివ, కుడుదుల వెంకన్న, రావికంటి సతీష్, ఆయిలి ప్రసాద్, బండారి ప్రసాద్, ఎరుకల ప్రవీణ్, తోకల మల్లేష్ ఇందారపు అనిల్, ఆరెల్లి కిరణ్, అక్కపాక సది లతో పాటు తదితరులు పాల్గొన్నారు


# శైలజానాథ్‌తో మాజీ ఎంపీ జేసీ చర్చలు

**శింగనమల**

పీసీసీ మాజీ అధ్యక్షుడు , కాంగ్రెస్ పార్టీ కీలక నేత సాకే శైలజానాథ్ తో మాజీ ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి సమావేశమయ్యారు. సాకే శైలజానాథ్ ను టీడీపీలోకి ఆహ్వానించినట్లుగా చెబుతున్నారు. శింగనమల నంచి గతంలో రెండు సార్లు గెలిచిన శైలజానాథ్ మంత్రిగా కూడా పని చేశారు. ప్రస్తుతం శింగనమలలో టీడీపీ గ్రూపు రాజకీయాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ కారణంగా ఇంకా ఇంచార్జిని కూడా నియమించలేదు. బలమైన అభ్యర్థి ఉండాలని.. తాము సూచించిన వారికే టిక్కెట్ ఇవ్వాలని జేసీ బ్రదర్స్ పట్టుబడుతున్నారు. దీంతో టీడీపీ హైకమాండ్ అక్కడ అభ్యర్థిత్వం ఎవరికి అన్నది ఖరారు చేయలేదు. ఈ క్రమంలో జేసీ .. శైలజానాథ్ తో చర్చలు జరపడం హాట్ టాపిక్ గా మారింది. కొంత కాలంగా శైలజానాథ్ టీడీపీలో చేరుతారనే ప్రచారం జరుగుతోంది. పీసీసీ చీఫ్‌గా పదవి కాలం పూర్తయిన తర్వాత శైలజానాథ్ కాంగ్రెస్ రాజకీయాల్లో యాక్టివ్ గా లేరు. వచ్చే ఎన్నికల్లో తాను శింగనమల నుంచే పోటీ చేయాలనుకుంటున్నానని శైలజానాథ్ ప్రకటించారు. అయితే, ఏ పార్టీ నుంచి అనేది మాత్రం త్వరలో చెబుతానంటూ వెల్లడించారు. ఇప్పటికే శైలజానాద్ టీడీపీ ముఖ్య నాయకత్వం తో టచ్ లోకి వెళ్లినట్లు సమాచారం. శైలజానాద్ 2004, 2009 ఎన్నికల్లో అప్పటి టీడీపీ సీనియర్ నేత శమంతమణి పైన విజయం సాధించారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత శమంతకమణికి ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారు. 2014 ఎన్నికల్లో శమతకమణి కుమార్తె యామినీ బాల టీడీపీ నుంచి ప్రస్తుత వైసీపీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పైన విజయం సాధించారు2019 ఎన్నికల్లో ప్రస్తుత టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ బండారు శ్రావణి పైన జొన్నలగడ్డ పద్మావతి గెలుపొందారు. వచ్చే ఎన్నికల్లో బండారు శ్రావణి టీడీపీ నుంచి తిరిగి సీటు ఆశిస్తున్నారు. నియోజకవర్గంలో కొంత కాలంగా టీడీపీలో విభేదాలు నెలకొన్నాయి. ఇప్పుడు శైలజానాద్ కు సీటు పైన హామీ దక్కుతుందా లేదా అనేది కీలకంగా మారింది.వచ్చే ఎన్నికల్లో గెలుపు గుర్రాలకే టిక్కెట్లు ఇస్తామని టీడీపీ నేతలు అంటున్నారు. అందుకే బలమైన నేతల్ని చేర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అనంతపురం పార్లమెంట్ నుంచి జేసీ దివాకర్ రెడ్డి కుమారుడు పోటీ చేసే అవకాశం ఉంది. బలమైన అభ్యర్థులు అసెంబ్లీ పరిధిలో ఉండాలని ఆయన కోరుతున్నారు. శైలజానాథ్ బలమైన అభ్యర్థి అవుతారని ఆయన అనుకుంటున్నారు. అనంతపురం జిల్లా ప్రజలు మద్దతిస్తే మొత్తం ఏకపక్షంగా ఒకే పార్టీకి మద్దతుగా నిలుస్తారు. 2014 ఎన్నికల్లో వైసీపీకి కేవలం రెండు సీట్లు మాత్రమే దక్కాయి. అదే 2019 ఎన్నికల్లో టీడీపీ రెండు సీట్లకే పరిమితం అయింది. వచ్చే ఎన్నికల్లో తిరిగి పార్టీ బలోపేతం దిశగా నియోజకవర్గాల వారీగా చంద్రబాబు కొన్నాళ్లుగా కసరత్తు చేస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో లోకేష్ పాదయాత్ర విజయవంతం కావడంతో ఆ పార్టీ నేతలు సంతృప్తిగా ఉన్నారు.

# పోలీసుల అదుపులో యువకుడు మృతి

**సికింద్రాబాద్**



తుకారం గేట్ పోలీసుల అదుపులో వున్న యువకుడి మృతి గాంధీ ఆసుపత్రి లో ఉద్రిక్తత రేపింది. మంగళవారం రాత్రి తుకారం గేట్ పోలయీసులు నిందితుడు చిరంజీవిని అదుపులో తీసుకుని పోలీసు స్టేషన్ కు తరలించారు. నిందితుడు అనారోగ్యానికి గురి కావడంతో గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చిరంజీవి మృతి చెందాడు. మృతి విషయం తెలుసుకున్న బంధువులు పెద్ద ఎత్తున అందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో పోలీసులు గాంధీ ఆసుపత్రి బయటే మోహరిం చారు. మీడియాను ఆసుపత్రి మెయిన్ ఎంట్రన్స్ లోనే నిలువరించారు. పోలీసులే కొట్టి చంపారు అంటున్న బంధువులు, పెద్ద పెట్టున నినాదాలు చేసారు. గాంధీ హాస్పిటల్ ముందు... ముషీరాబాద్ మెయిన్ రోడ్ బాధితులు రాస్తారోకో నిర్వహించారు.

ప్రజా తపన
prajathapana.com

## గోడ కూలి చిన్నారి మృతి

**హైదరాబాద్**
రహమాత్ నగర్ లోని ఓ ఇంట్లో విషాదం నెలకొంది, గోడ కూలి 8 నెలల జీవనికా అనే బాలిక మృతి చెందింది. మంగళవారం రాత్రి రాత్రి సమయంలో తల్లిదండ్రుల వద్ద నిద్రిస్తున్న వారిపై పక్కనే ఉన్న బహుళ అంతస్థుల రాళ్లు పైన పడడంతో చిన్నారి అక్కడికి అక్కడికి మృతి చెందింది. నారాయణఖేడ్ చెందిన శ్రీకాంత్, జగదేవి చెందిన రెండో సంతానం జీవనిక. కొద్ది సంవత్సరాల క్రితం కూలి పని కోసం ఓంనగర్ లో తల్లిదండ్రులు వుంటున్నారు. మంగళవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం రావడంతో పక్కనే ఉన్న నాలుగు అంతస్తుల పై నుండి రాళ్లు కింద పడ్డాయి. రేకుల రూమ్ లో ఉంటున్న ఇంటిపై నేరుగా పడడంతో నిద్రిస్తున్న దంపతులు ప్రక్కనే పడుకున్న బాలిక పై పడడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది.

## మిర్చి రైతులను ఆదుకుంటాం

**మంత్రాలయం**



మంత్రాలయం నియోజకవర్గం డి.బెళగళ్ వద్ద మిర్చిరైతు కర్రియ్యను టీడీపీ నేత నారా లోకేష్ కలిసి, ఆయన కష్టాలు తెలుసుకున్నారు. రైతు కర్రియ్య మాట్లాడుతూ అన్నదమ్ములం కలిసి 5ఎకరాల మిర్చిపంట వేశాం. రూ.10 లక్షల పెట్టుబడి అయితే 2లక్షల దిగుబడి వచ్చింది. నల్లితెగులు వచ్చి పంట నాశనమైంది. కోత కూలీ, పరదాలు, తాలుకాయల ఏరివేతకే రూ.2లక్షల ఖర్చయింది... గతంలో 28రకం ఎరువుల బస్తా రూ.1100 ఉంటే, ఇప్పుడు రూ.1900 అయింది. మంగళవానం రాత్రికూడా వర్షంపడి నానా అవస్థలు పడ్డాం. పట్టించుకునే నాథుడే లేడు. పరిస్థితులు ఇలాగే ఉంటే కొంతకాలానికి రైతు అనే వాడే ఉండడని అన్నారు. నారా లోకేష్ మాట్లాడుతూ మోటార్లకు మీటర్లు పెట్టి రైతుల మెడకు ఉరితాళు బిగించాలని చూస్తున్నారు. టిడిపి ప్రభుత్వం వచ్చాక గతంలో ఇచ్చిన సబ్సిడీలన్నీ పునరుద్ధరించి రైతులను ఆదుకుంటాం. పెట్టుబడులు తగ్గించి వ్యవసాయం లాభసాటి అయ్యేలా చర్యలు తీసుకుంటాం .రైతులు అధైర్య పడకుండా ఒక్క ఏడాది ఓపిక పట్టండని అన్నారు.

## గవర్నర్‌పై మంత్రి హరీష్ రావు ఫైర్

**హైదరాబాద్**
తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై పై మంత్రి హరీష్ రావు విమర్శలు కురిపించారు. మంత్రి మాట్లాడుతూ 60 సంవత్సరాలుగా లేని అభివృద్ధిని 6 సంవత్సరాలలో చేసి చూపాడు. కేంద్ర ప్రభుత్వాలు రైతుల ఆదాయంను తగ్గించింది. ఈ రాష్ట్రానికి రావాల్సిన ఉద్యోగాలను గవర్నర్ అడ్డుకుంటుందని అన్నారు. గవర్నర్ వ్యవస్థను అడ్డుపెట్టుకొని కేంద్ర ప్రభుత్వం ఆడుతున్న డ్రామా లో భాగం రాష్ట్రానికి రావలసిన బిల్లులను ఆపుతున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఫారెస్ట్ యూనివర్సిటీ ని తీసుకిచిన ఘనత మన కేసీఆర్ ది. గవర్నర్ మన రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటుంది. బీజేపీ ప్రభుత్వం లేని రాష్టలలో గవర్నర్ వ్యవస్థను అడ్డుపెట్టుకొని అభివృద్ధిని అడ్డుకుంటుంది. ఈ రోజు లక్ష మంది పాస్పోర్ట్ లను విదేహాలలో తీసుకుంటున్నారు. దేశ సంపద బయటకు పోవడానికి కారణం బీజేపీ. నిజాన్ని ప్రజలకు తెలపకపోతే అబద్ధం రాజమేలుతుందని అన్నారు.

## బిఅరెస్ పార్టీపై ఆదరణ ప్రజల్లో ఉంది

**హైదరాబాద్**
బిఅరెస్ పార్టీకి దేశంలో ఏ పార్టీకి లేని ఆదరణ ప్రజల్లో ఉందని ఎంపి లింగయ్య యాదవ్ అన్నారు. నిన్న జరిగిన ప్రతినిధుల సభ విజయం అయింది..రేపు ప్లీనరికి రావాలని కోరుతున్నా. తెలంగాణ రాష్ట్రం సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయి. తెలంగాణ పథకాలు, మోడల్ కావాలని దేశ ప్రజలు ఎదురుచూస్తున్నారు. బండి సంజయ్ నోరుకు అదుపులేకుండా పోయింది..సజావుగా సాగుతున్న పాలనను అప్రధిష్ఠపాలు చేసే కుట్ర చేస్తున్నారు. జైలులో చిప్పకూడు తిన్న రేవంత్ రెడ్డి కూడా కెసిఆర్ ను విమర్శిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీకి ప్రజాదరణ లేదు. ప్రధాని కుర్చి ఖాళీ లేదని అమిత్ షా అంటున్నారు..మీ అయ్యా కుర్చి కాదు ప్రధాని చైర్. నరేంద్ర మోడీ ఒక పిరికి ప్రధాని- అదాని ఏజెంట్లు మోడీ, అమిత్ షా. మునుగోడు ఫలితమే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి రానున్నాయి. బీజేపీ నాయకులు సిగ్గులేకుండా మాట్లాడుతున్నారు...నోరు అదుపులో పెట్టుకుంటే వాళ్లకు మంచిది. కాంగ్రెస్ బీజేపీ నాయకులు ఎన్ని రైతు యాత్రలు చేసినా,, పాదయాత్రలు చేసినా ప్రజలు నమ్మరని అన్నారు.

## నీళ్లపాలయిన పంటలు

**మహబూబాబాద్**
మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం లో రాత్రి కురిసిన అకాల వర్షానికి భారీ పంట నష్టం జరిగింది ఏజెన్సీ మండలం కావడం తొ భారీ వర్షాలకు మండలం లో మొత్తం అన్ని గ్రామాలలో మొక్కజొన్న, వరి పంటలు మొత్తం కూడా నీళ్ల పాలు కావడం జరిగింది మొండ్రాయి గ్రామం లో వజ్జ నాగలక్ష్మి కీ చెందిన రెండు ఎకరాలు మొత్తం నీటి పాలు కావడం తొ పెట్టిన పెట్టు బడి మొత్తం పోయి చేతికి వచ్చిన పంట మొత్తం నష్టం జరిగింది అని రైతు ఆవేదన వ్యక్తం చేసింది బయట నుండి వడ్డీకి తెచ్చి పెట్టుబడి పెట్టిన అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు రైతులు మమ్ముల్ని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.. అదేవిధంగా మోకాళ్ళ పల్లి గ్రామం లో రాత్రి కురిసిన వర్షలకు భూపాతి రమేష్ కు చెందిన ఇల్లు మొత్తం నెల మట్టం అయింది అని సుమారు 5లక్షలు మేర నష్టం జరిగింది అని రమేష్ ఆవేదన వ్యక్తం చేశాడు

# విజయవాడలో మహాలక్ష్మి యాగం

**విజయవాడ :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంక్షేమం కోసం దేవాదాయశాఖ ఆధ్వర్యంలో చండీరుద్ర రాజ శ్యామల సుదర్శన సహిత శ్రీలక్ష్మి మహా యాగాన్ని చేస్తున్నట్టు దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్య నారాయణ తెలిపారు. మే 12 నుంచి మే 17వ తేదీ వరకు ఆరు రోజుల పాటు కార్యక్రమం జరగనుంది. విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ మహా యాగాన్ని నిర్వహించనున్నారు. ఈ యాగానికి సంబంధించిన నిర్వహణ ఏర్పాట్లను అధికారులతో కలిసి దేవాదాయశాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ పరిశీలించారు. రాష్ట్రం సశ్య శ్యామలంగా ఉండేలా, ప్రజలు సౌభాగ్యం తో జీవించేలా రాష్ట్ర సర్వతోముఖాభివృద్దే లక్ష్యంగా ఎంతో పవిత్రమైన ఈ యజ్ఞాన్ని ప్రభుత్వం చేపడుతోందన్నారు. ఈ మహా క్రతువు మే 12వ తేదీ ఉ.5గం.లకు బ్రహ్మ ముహూర్త కాలంలో ప్రారంభ మవుతుందన్నారు. ప్రధానంగా నాలుగు యాగశాలలు ఉంటాయని, ఒక్కో యాగ శాలలో 108 కలశాలతో యాగం జరుగుతుందన్నారు. ఈ యాగ కార్యక్రమాల్లో 520 మందికిపైగా రుత్వికులు పాల్గొంటారని చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, తిరిగి సాయంకాలం 6 గంటల నుంచి 9 గంటల వరకు యాగ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. వీటితోపాటు ప్రతి రోజు అనేక ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో భాగంగా చాగంటి కోటేశ్వరరావు, సామవేదం షణ్ముఖ శర్మ వంటి ప్రవచనకర్తలు కూడా పాల్గొని ప్రజలకు వివిధ ప్రవచనాలు ద్వారా హిందూ ధార్మిక పరిరక్షణ తదితర అంశాలను తెలియజేస్తారని దేవాదాయ శాఖ కమిషనర్ తెలిపారు. స్వరూపానంద స్వామి, చినజీయర్ స్వామి, కుర్తాళ సిద్ధేశ్వర, మంత్రాలయ, జగద్గురు పండితా రాధ్య తదితర పీఠాధిపతులు కూడా పాల్గొంటారన్నారు. యాగశాలల లోపలికి ఎవరికీ అనుమతి ఉండదని, మే 17 తేదీన చివరి అంకంలో భాగంగా పూర్ణహుతి ఉంటుందన్నారు. యాగం నిర్వహణకు దాదాపు రూ.5 కోట్లు వ్యయం అవుతుందన్నారు.ఈ మహా యజ్ఞాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల సమన్వయం అవసరమని దీని కోసం 13 కమిటీలు పని చేస్తాయన్నారు. ట్రాఫిక్, ప్రోటోకాల్ వంటి అంశాలకు సంబంధించి జిల్లా కలెక్టర్, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ సూచనలు, సలహాలు అమలు చేస్తామన్నారు. ఆరు రోజుల పాటు జరిగే యాగానికి సంబంధించిన ఏర్పాట్లపై ప్రభుత్వం ప్రత్యేకంగా శ్రద్ద చూపిస్తోంది. రాష్ట్రంలో ఉన్న పరిస్థితులు అధిగమించి, సంక్షేమాన్ని ఆశిస్తూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఇంత భారీ స్థాయిలో కార్యక్రమాన్ని నిర్వహించటం ఇదే ప్రప్రథమం. అందుకే ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సతీసమేతంగా ఈ కార్యక్రమానికి హజరయ్యే అవకాశం ఉంది. అయితే సీఎం షెడ్యూల్ ఇంకా నిర్దారణ కాలేదు. తిరుమల తిరుపతి దేవస్థానానికి సంబంధించిన అర్చకులు ఈ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో నిర్వహిస్తారు. పూర్తి ఖర్చలను దేవాదాయ శాఖ భరిస్తోంది. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలకు చెందిన అర్చకులు, ఈ ఆరు రోజుల కార్యక్రమంలో పాల్గొని ప్రతి రోజు కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు.

# కేసీఆర్ పై పోటీ వెనక్కి తగ్గిన ఈటెల

**కరీంనగర్ :**

బీజేపీ నేత ఈటల రాజేందర్ తాను గజ్వేల్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని గతంలో ప్రకటించారు. అధినాయకత్వం ఆదేశిస్తే తాను కేసీఆర్‌పై పోటీకి దిగేందుకు సిద్ధమన్నారు ఈటల. అయితే హుజూరాబాద్ నియోజకవర్గంలో ఇప్పటి వరకూ జరిగిన ఎన్నికల్లో ఈటల రాజేందర్ ఏడు సార్లు గెలుపొందారు. ఉప ఎన్నికలు, సాధారణ ఎన్నికలు అన్నీ కలిపితే ఆయనకు నియోజకవర్గంలో ఎంత గ్రిప్ ఉందో ఇట్టే అర్థమవుతుంది. హుజూరాబాద్ నియోజకవర్గం ఈటల రాజేందర్‌కు కంచుకోట వంటిది. అక్కడ పార్టీల కన్నా ఈటల అంటే అభిమానం ఎక్కువగా ఉన్నవారు కనిపిస్తారు.అలాంటి నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నిక లోనూ ఈటల విజయం సాధించారు. అధికార బీఆర్ఎస్ ఎంతగా ప్రయత్నించినా గెలవలేక పోయింది. బీసీ సామాజికవర్గానికి చెందిన గెల్లు శ్రీనివాస్‌ను బరిలోకి దింపినా చివరకు విజయం ఈటలదే అయింది. హోరా హోరీగా సాగిన పోరులోనూ ఈటల ఉప ఎన్నికల్లో 20 వేల మెజారిటీతో గెలుపొందారు. అక్కడ కాంగ్రెస్‌కు డిపాజిట్లు కూడా దక్కలేదు. ఉప ఎన్నికల సందర్భంగా అక్కడ కేసీఆర్ చేయని ప్రయోగం లేదు. టీడీపీ అధ్యక్షుడిగా ఉన్న ఎల్. రమణను పార్టీలోకి తీసుకుని ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. కాంగ్రెస్‌లో కీలకంగా ఉన్న పాడె కౌశిక్‌రెడ్డికి పార్టీ కండువా కప్పి ఆయనను కూడా శాసనమండలి కి పంపారు. పెద్దిరెడ్డిని ఒక్కడినే పదవులకు దూరం పెట్టినా ఆయనకు కూడా పదవి దక్కుతుందని హామీ ఇచ్చారు. దళితబంధు పథకాన్ని అక్కడి నుంచే ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టినా ఫలితం దక్కలేదు.వందల కోట్లు ఉప ఎన్నిక సందర్భంగా ఖర్చయినా కూడా ఈటల రాజేందర్‌ను ఓడించలేక పోయారు. దీంతో హుజూరాబాద్ ఉప ఎన్నిక అధికార బీఆర్ఎస్‌ను ఒకింత రాజకీయంగా అప్పట్లో ఇబ్బంది పెట్టిందనే చెప్పాలి. అటువంటి నియోజకవర్గాన్ని వదులుకుని ఈటల రాజేందర్ గజ్వేల్ నియోజకవర్గానికి ఎందుకు వస్తారన్న చర్చ మొన్నటి వరకూ జరిగింది. అయితే ఇప్పుడు ఆ ఆలోచన ఈటల విరమించుకున్నారని చెబుతున్నారు. తిరిగి ఆయన హుజూరాబాద్ నియోజకవర్గం నుంచే పోటీ చేయడానికి ఆసక్తి కనబరుస్తారని పార్టీ నేతలు చెబుతున్నారు. పార్టీ అధినాయకత్వం కోరినా తాను హుజూరాబాద్ నుంచే పోటీ చేస్తానని చెప్పాలని ఈటల రాజేందర్ డిసైడ్ అయ్యారం టున్నారు. అందుకు కారణాలు కూడా లేకపోలేదు. దాదాపు హుజూరాబాద్ నియోజకవర్గంలో ప్రతి గడపతో ఈటలకు పరిచయం ఉంది. అది వదులుకోవడం మూర్ఖత్వం అవుతుందని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఎనిమిదో సారి అసెంబ్లీలోకి వరసగా కాలు మోపాలంటే హుజూరాబాద్ నియోజకవర్గం బెటర్ అని ఆయన భావిస్తున్నట్లు సమాచారం. దానికి తగ్గట్లు కేసీఆర్ తీసుకున్న నిర్ణయం కూడా ఆయన ఆలోచనలో మార్పు తెచ్చిందంటున్నారు. గెల్లు శ్రీనివాస యాదవ్‌కు నామినేటెడ్ పోస్టు ఇచ్చారు. అక్కడ వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డికి టిక్కెట్ కేసీఆర్ కన్ఫర్మ్ చేశారంటు న్నారు. ఇటీవల ఆ నియోజకవర్గంలో పర్యటించిన మంత్రి కేటీఆర్ కూడా కౌశిక్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని కోరడంతో ఆయనకు టిక్కెట్ అని తేలిపో యింది. కౌశిక్ రెడ్డి అయితే తన గెలుపు సులువు అని ఈటల భావిస్తున్నారు. దీంతో ఈటల తిరిగి వచ్చే ఎన్నికల్లో హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని నిర్ణయించుకున్నారని తెలిసింది.

# పొంగులేటీకి రేణుకా అడ్డుపడుతున్నారా

**ఖమ్మం :**

ఒకరు ఎస్ అంటే?ఇంకొకరు నో అనడం కాంగ్రెస్ డీఎన్ఏలో ఉన్న సహజ లక్షణం. తెలంగాణ కాంగ్రెస్‌నే తీసుకుంటే? ఒక అడుగు ముందుకు, నాలుగు అడుగులు వెనక్కు అన్నట్టుగా ఉంటుంది వ్యవహారం. పార్టీలోకి చేరికల విషయంలో కూడా ఇదే పెద్ద సమస్యగా మారిపోతోందట. ప్రస్తుతం కొందరు నాయకుల చేరికపై పార్టీలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయట. వచ్చేస్తాం? మీ పార్టీలోకి అని ఆ నాయకులు అడుగుతుంటే?. లోపల ఉన్నవారు మాత్రం పేచీల మీద పేచీలు పెట్టేస్తున్నారట.మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డితోపాటు? మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధమైపోయారట. పార్టీ పెద్దలతో సంప్రదింపులు కూడా ముగిశాయట. ఇద్దరిలో.. జూపల్లి చేరికకు అంతా ఓకే. తేదీ ఖరారు కావాల్సి ఉందట. ఇక మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎపిసోడ్ మాత్రం టీవీ సీరియల్‌లా సాగుతూనే ఉందట. శ్రీనివాస్ రెడ్డి పార్టీలో చేరితే ఏడు అసెంబ్లీ సీట్లు అడుగుతున్నారని, ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థుల్ని గెలిపించే బాధ్యత నాదేనంటూ అధిష్టానానికి చెప్పారని ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్ నాయకత్వం కూడా అందుకు అంగీకరించినట్టు చెప్పుకుం టున్నారు. అంతవరకు బాగానే ఉన్నా.. అక్కడే జిల్లాకు చెందిన నేతలతో సమస్య వచ్చిందట .పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేరికపై ఖమ్మం జిల్లాకు చెందిన సీనియర్ నాయకురాలు రేణుకా చౌదరి అభ్యంతరం చెప్తున్నారు. ఆయనకు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు అప్పగించడం ఏంటన్న మౌలిక ప్రశ్న లేవనెత్తుతున్నారామె. శ్రీనివాస్ రెడ్డి చేరిక వ్యవహారాన్ని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఏఐసిసి కార్యదర్శి రోహిత్ చౌదరిలకు అప్పగించింది హైకమాండ్. అయితే.. భట్టితో రేణుకా చౌదరికి ఉన్న వైరం కారణంగా శ్రీనివాస్ రెడ్డిని ఆమె వ్యతిరేకిస్తున్నారన్న చర్చ పార్టీలో జరుగుతోందట. 2019 లోక్‌సభ ఎన్నికల్లో పొంగులేటికి టికెట్ ఇచ్చినా అభ్యంతరం లేదన్న రేణుకాచౌదరి ప్రస్తుతం అభ్యంతరం చెప్పడమేంటన్న ప్రశ్నలు వస్తున్నాయట. వచ్చే ఎన్నికల్లో ఖమ్మం నుంచి తానే పోటీ చేయాలన్న ఆలోచనలో భాగంగానే పొంగులేటిని అడ్డుకుంటున్నారా ? లేదంటే భట్టి విక్రమార్క?శ్రీనివాసరెడ్డి ఏకమైతే తనకు రాజకీయంగా ఇబ్బంది అవుతుందని భావిస్తున్నారా.. ? అన్న చర్చ జిల్లా పార్టీలో మొదలైందట. ఎవరు అడ్డుచెప్పినా..పట్టించుకోకుండా పార్టీ



అధిష్టానం మాత్రం శ్రీనివాస్ రెడ్డిని తీసుకోవాలని డిసైడ్ అయినట్టు తెలుస్తోంది.పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేరికపై ఢిల్లీ నాయకత్వానికి, పీసీసీకి క్లారిటీ ఉందట. ఖమ్మం జిల్లా నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క నుంచి కూడా ఎలాంటి అభ్యంతరం లేదు. ఎటొచ్చీ?రేణుక చౌదరి నుంచి వచ్చిన అభ్యంతరాల మీదే చర్చ జరుగుతోంది. పొంగులేటి చేరిక ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్‌కి అదనపు బలం అవుతుందన్న అభిప్రాయం అధిష్టానానికి ఉందట. కేవలం జిల్లాలోనేగాక రాష్ట్ర వ్యాప్తంగా దీని ప్రభావం ఉంటుందని కూడా ఢిల్లీ నాయకత్వం అనుకుం టోందట. దీంతో అందర్నీ ఒప్పించి పొంగులేటిని రప్పించే బాధ్యతను రాష్ట్ర నాయకత్వం మీదే పెట్టిందట ఏఐసీసీ.

## బీఆర్ఎస్ నేతపై ఎమ్మెల్యే మండిపాటు

**రాజేంద్రనగర్**
రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కచ్చితంగా రాజేంద్రనగర్ నుండి పోటీ చేస్తానంటూ బీఆర్ఎస్ యువ నేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్తీక్ రెడ్డికి దమ్మొంటే ఆ విషయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ తో చెప్పించాలని ఆయన సవాల్ విసిరారు. కాటేదాన్ దుర్గా నగర్ చౌరస్తా వద్ద మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సిట్టింగ్ ఎమ్మెల్యేలకే టికెట్ కేటాయిస్తానంటూ సాక్షాత్తు ముఖ్యమంత్రి కేసీఆర్ తో పాటు మంత్రి కేటీఆర్ ఇప్పటికే ప్రకటించారని ఆ విషయాన్ని కార్తీక్ రెడ్డి గుర్తుంచుకోవాలని సూచించారు. వరుసగా మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా హట్రిక్ విజయం సాధించిన తానీ ఈసారి ఎన్నికల్లో కూడా నాలుగో సారి విజయం సాధిస్తానని ప్రకాష్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. అనవసరమైన ప్రకటనలు చేసి జనాలను కన్ఫ్యూజ్ చేయొద్దని ఆయన కార్తీక్ రెడ్డికి సూచించారు.

## పొందుర్తి గ్రామంలో రేవంత్ పర్యటన

**కామారెడ్డి**
కామారెడ్డి జిల్లా పొందుర్తి గ్రామంలో పంటనష్టపోయిన రైతులను పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి షబ్బీర్ అలీ బుధవారం కలిసారు. గత రెండు రోజులుగా కురిసిన అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను, దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలించారు.

## దారి మళ్లించిన ర్యాపిడో డ్రైవర్

**బెంగళూరు**
ర్యాపిడో బుక్ చేసుకున్న ఓ యువతి ఆత్మరక్షణ కోసం బైక్ పైనుంచి దూకేసిన ఘటన బెంగళూరులో వెలుగు చూసింది. ఈనెల 21న ఇందిరానగర్ నుంచి యువతి ర్యాపిడో బుక్ చేయగా.. ఓటీపీ చెక్ చేయాలని నిందితుడు ఆమె ఫోన్ తీసుకున్నాడు. ట్రిప్ స్టార్ట్ చేశాక రాంగ్ రూట్లో తీసుకెళ్లాడు. యువతిని అసభ్యంగా తాకే ప్రయత్నం చేయడంతో భయంతో ఆమె బైక్ పైనుంచి దూకేసింది. దాంతో ఆమెకు గాయాలయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు దీపక్ ను అరెస్ట్ చేశారు.

## పంట నష్టం పరిహారం కోసం రోడ్డెక్కిన ఎమ్మెల్యే

**జనగామ**
అకాల వర్షానికి జరిగిన పంట నష్టం పరిహారం కోసం రోడ్డెక్కిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే 45ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి నిరసనకు దిగారు. నర్మెట్ట వద్ద రైతులు, వామపక్ష నేతలతో కలిసి నిరసన చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఎకరాకు 10వేలు ఇస్తోంది. కేంద్రం ఎకరాకు 30 వేలు పరిహారం ఇవ్వాలి. జైళ్లకు పంపిస్తాం అని బెదిరించడం కాదు, తెలంగాణ రైతులను ఆదుకోండని అయన అన్నారు

## మర్డర్ కేసులో మరో వీడియో

**మంచిర్యాల**
మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం లోని ఇందారం గ్రామం లో ప్రేమ వ్యవహారం లో వివాహిత మహిళ ప్రీతీ బంధువులు అత్యంత దారుణంగా హత్య చేసిన సంఘటన తర్వాత మారో వీడియో కాల్ లీక్ అయ్యింది, మహేష్ తో ప్రేమించిన యువతీ ప్రీతీ తన బాధను మహేష్ కు వీడియో కాల్ లో తన భర్త ఎలా హింసిస్తున్నాడో.. మహేష్ మర్డర్ కాక ముందు వీడియో కాల్ లో తన బాధను మహేష్ తో షేర్ చేసుకుంది.

## వెలుగులో జరుగుతున్న అవినీతిని అరికట్టండి

**కౌతాళం**
మండలం పరిదిలో కరణి గ్రామానికి చెందిన రత్న గ్రామ సంఘం వెలుగు ఆఫీస్ ముందు వెలుగు ఆఫీసులో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని సీపీఎం మల్లయ్య అధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం వారు సిసి వెంకటేశులకు అవినీతిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రాన్ని అందించారు. వివరాల్లోకి వెళితేజనవరి 07.01.2022 న మా సంఘం అప్పును మొత్తం 62 వేలును బ్యాంకులో మా ఖాతాకు జమ చేయడం అయినది. ఆ డబ్బులను గతంలో ఉన్న సిసి హేమంత్ కుమార్ , వివో ఏ శ్రీరాములు ఇద్దరు కలిసి ఆ 40,000 రూ ను శ్రీనిధి ఖా త కు బదిలీ చేసినారు. రత్న సంఘం అప్పు ఇప్పటికీ 22,000 అప్పుగా ఉన్నట్లు చూపుతున్నారు మేము శ్రీనిధి కింద అప్పు(లోను) తీసుకోవాలనుకుంటే మీ పాత బకాయి చెల్లిస్తే శ్రీనిధి లోను మీకు వస్తుందని సిసి వివోఏ మాకు చెప్పడంతో మేం మొత్తము అప్పు చెల్లించినామని నిలదీస్తే మీ డబ్బులను శ్రీనిధికి ట్రాన్స్ఫర్ చేసినాము తొందరలోనే మీ అప్పు చెల్లిస్తామని శ్రీరాములు హామీ ఇచ్చారు.నిరసన కార్యక్రమంలో రత్న గ్రూప్ సభ్యులు ఉరుకుందమ్మ, నాగలక్ష్మి ,నర్సమ్మ, లక్ష్మి, తాయమ్మ ,సుశీలమ్మ,ఈ రమ్మ, ఉల్లిగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆరు రోజుల పాటు వర్ష సూచన..!

**హైదరాబాద్**
రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో మరో ఆరు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. మంళవారం రాత్రి, బుధవారం ఉదయం వాన దంచికొట్టిన విషయం తెలిసిందే. రామచంద్రాపురంలో అత్యధికంగా 92 మి.మీ. వర్షపాతం నమోదైంది. మరో ఆరు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఏప్రిల్ 26వ తేదీన ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు చోట్ల ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఏప్రిల్ 27, 28 తేదీల్లో కూడా ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉంది.

# జనసేనాని మార్పు దిశగా అడుగులు



**విజయవాడ :**

రాజకీయాల్లో విలువలు అడుగంటుతున్న సమయంలో పవన్ కల్యాణ్ తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు రాజకీయ పరిపక్వతను చాటుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికలకు మరో ఏడాది మాత్రమే సమయమున్న తరుణంలో జనసేన నాయకులు, వీరమహిళలు, జనసైనికులను ఉద్దేశించి పవన్ కల్యాణ్ తాజాగా రాసిన బహిరంగ లేఖ ద్వారా అందరి దృష్టి తనవైపు తిప్పుకున్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజాశ్రేయస్సు కోసం శ్రమిస్తున్న జనసైనికుల దృష్టి మరల్చడానికి, జనసేన భావజాలాన్ని కలుషితం చేయడానికి కొన్ని శక్తులు నిరంతరం పనిచేస్తున్నాయని, వాటిని సరిగా అర్థం చేసుకుని పార్టీ నాయకులు, శ్రేణులు ముందుకు వెళ్లాల్సి ఉందని జనసేనాని దిశానిర్దేశం చేశారు."సామాజిక మాధ్యమాల్లో వచ్చే సమాచారం ఆధారంగా పొత్తుల గురించి ఎవరికి వారు ఏదేదో మాట్లాడొద్దు, పొత్తుల విషయంలో మేలు చేసే నిర్ణయం నేనే స్వయంగా తీసుకుంటా" అని పవన్ కల్యాణ్ ఈ లేఖలో స్పష్టం చేశారు. పొత్తుల విషయంలో పవన్ కల్యాణ్ ముందు నుంచీ ఒక ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నారు. కార్యకర్తలను కూడా మానసికంగా పొత్తుల కోసం సిద్ధం చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో జరిగిన 'యువశక్తి' సభావేదిక నుంచి తొలిసారి ఆయన ఒంటరి పోరుకు బలం చాలదనే పొత్తుకు సన్నద్ధమవుతున్నట్లు ప్రకటించారు. పొత్తుల్లో తప్పులేదని, నియంతను ఎదుర్కోవడానికి కలిసికట్టుగా పోరాడాల్సిందేనని పిలుపునిచ్చారు. ఆ తర్వాత మచిలీపట్నంలో జరిగిన పార్టీ ఆవిర్భావ సభలో కూడా పవన్ కల్యాణ్ ప్రతిపక్షాల ఓట్లు చీలనివ్వననే లక్ష్యాన్ని స్పష్టంగా ప్రకటించారు. ఆ తర్వాత ఢిల్లీ పర్యటనలో భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను కలిసిన తర్వాత కూడా వైఎస్సార్సీపీ పాలన నుంచి ఆంధ్రప్రదేశ్‌కి విముక్తి కలిగిస్తామని, ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదనే తన అభివాదమని, అజెండా అని ఆయన తేల్చి చెప్పారు. ఈ పరిణామాలు గమనిస్తే పొత్తుల గురించి జనసేన నాయకులకు, కార్యకర్తలకు ఉన్న అవగాహన, వైఎస్సార్సీపీ నాయకులకు, రాజకీయ విశ్లేషకులకు లేదేమో అనిపిస్తోంది. దానివల్లే టీడీపీ-జనసేన పొత్తు ఎప్పుడు చితికిపోతుందా అని వైఎస్సార్సీపీ శ్రేణులు దింపుడు కళ్లెం ఆశలతో ఎదురు చూస్తున్నాయి. పొత్తుల గురించి పవన్ మాట్లాడినప్పుడల్లా అధికార వైఎస్సార్సీపీ ఉలిక్కిపడుతోంది. పవన్ కల్యాణ్ టీడీపీకి అమ్ముడుపోయారని పదునైన మాటలతో ఆరోపణలు చేస్తోంది. మరో అడుగు ముందుకేసి దమ్ముంటే అన్ని సీట్లలో పోటీ చేయాలని జనసేనను రెచ్చగొడుతోంది. మాజీ మంత్రి కొడాలి నానీ, మంత్రి అంబటి రాంబాబు లాంటి వాళ్లు ఇంకో అడుగు ముందుకేసి పవన్ కళ్యాన్‌ని, ప్రతిపక్షాలను దూషిస్తూ తీవ్రంగా విరుచుకుపడుతున్నారు. మంత్రి స్థానంలో ఉన్న ఆదిమూలపు సురేశ్ తన హోదాను మరిచి ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో చొక్కా విప్పి వీరంగం సృష్టించారు. ఇక, అధికార పక్షానికన్నా తామేం తక్కువ తిన్నామా అన్నట్టు టీడీపీ నాయకులు కూడా రెచ్చిపోతున్నారు. టీడీపీ నాయకులు పట్టాభి, వంగలపూడి అనిత, చింతమనేని ప్రభాకర్ లాంటి వాళ్లు సభ్య సమాజం తలదించుకునేలా మాట్లాడుతున్నారు. 2009 ఎన్నికల ముందు పంచెలూడదీసి కొడుతానని, ఇటీవల ఒక కార్యకర్తల సమావేశంలో ఆవేశంగా మాట్లాడుతూ 'మరొక్కమారు ప్యాకేజీ అన్నారంటే కొడతాను వైపీసీ కొడుకులారా..' అంటూ చెప్పు చూపించిన జనసేనాని పవన్‌లో మార్పు రావడం స్వాగతించాల్సిన అంశం. కేవలం సూచనలు చేయడం కాకుండా ఈ మార్పును పవన్ తన నుంచే మొదలుపెట్టారు. గతానికి భిన్నంగా పవన్ కల్యాణ్ మచిలీపట్నం సభలో మాట్లాడారు. పరివర్తన కోసమే తాను ఆ సభ పెట్టినట్టు ఆయనే చెప్పుకున్నారు."వైసీపీని, వ్యక్తులను విమర్శించి ప్రయోజనం లేదు. ఈ సభ పరివర్తన కోసమే. మీరు ఓట్లు అమ్ముకోవడం మానుకోకపోతే విలువలు మాట్లాడే నాలాంటి నాయకులు ఓడిపోతూనే ఉంటారు. వచ్చే ఎన్నికల్లో మీ భవిష్యత్ కోసం మాకు అండగా నిలవండి. ఒక్కసారి జనసేనను చూడండి. కులాన్ని దాటి ఆలోచించండి.." అంటూ పవన్ కల్యాణ్ ఆ సభలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెంలో పర్యటిస్తున్న చంద్రబాబుపై ఇటీవల జరిగిన రాళ్లదాడిని ఖండిస్తూ ప్రతిపక్షాలను చూస్తే జగన్ ప్రభుత్వానికి ఎందుకు అంత అభద్రతా భావం..? అంటూ చంద్రబాబుకు అండగా నిలబడ్డారు. అధికారపక్షం బాధ్యత విస్మరించిన చోట కచ్చితంగా ప్రతిపక్షం ప్రజల కోసం నిలబడుతుందని పవన్ పరిపక్వతతో వ్యవహరించారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తున్న జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానుల్లో వచ్చిన మార్పు స్పష్టంగా కనపడుతోంది. అయినప్పటికీ ఎన్నికల వేళ తొందరపడి అధికారపార్టీ చేసే కుట్రల తాలూకు పద్మవ్యూహాల్లో చిక్కుకోవద్దనే జనసేనాని మరోసారి బహిరంగ లేఖ రాసినట్లు తెలుస్తోంది. ఈ లేఖను పరిశీలిస్తే పవన్ చేసిన మరో కీలక సూచనను కూడా ఇందులో గమనించవచ్చు. "మనతో మంచిగా ఉండే పార్టీలలోని చిన్న చితకా నేతలు మనపై ఏవైనా విమర్శలు చేస్తే, అవి నాయకుని వ్యక్తిగత విమర్శలుగానే భావించండి. అంతేతప్ప, ఆ వ్యాఖ్యలను ఆయా పార్టీలకు ఆపాదించవద్దు" అన్నారు. మొన్న జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ క్లీన్ స్వీప్ చేసిన తర్వాత కొంతమంది టీడీపీ నాయకులు "మనకు ఎవరితోనూ పొత్తులు అవసరం లేదు, ఒంటరిగానే అధికారంలోకి వచ్చేస్తాం" అని ఒంటరిగానే పోటీ అంటూ ప్రచారం మొదలుపెట్టారు. క్షేత్రస్థాయి పరిస్థితుల గురించి రాజకీయ అవగాహన లేకుండా మాట్లాడే ఇలాంటి నాయకుల వల్ల టీడీపీకే నష్టం జరుగుతుంది. ఇలాంటి నాయకుల మాటలకు ప్రతి విమర్శ చేస్తే జనసేన కూడా మూల్యం చెల్లించుకోక తప్పదు. ఫలితంగా టీడీపీ, జనసేన నాయకులు కొట్టుకుంటే, మధ్యలో వైస్సార్సీపీ లాభపడుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని జనసేనాని ఈ సూచన చేశారని స్పష్టమవుతోంది. అధికార పక్షం మీద ప్రజలు అసంతృప్తితో ఉన్నప్పుడు ప్రధాన ప్రతిపక్షం ప్రజా ఉద్యమాలు నిర్మించాలి. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా ప్రతిపక్ష పార్టీలను కలుపుకుపోవాలి. ఓట్లు చీలనివ్వనని టీడీపీ చెప్పాలి. కానీ, ఆ పని టీడీపీ చేయలేకపోతోంది. టీడీపీ బదులు జనసేన పార్టీయే చొరవ తీసుకొని మరీ ఈ విషయంలో పెద్దన్న పాత్ర పోషిస్తున్నది. ఇది పరిపక్వతకు నిదర్శనంనాయకులు, కార్యకర్తలు తమ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండాలి. ఉద్యమాలు చేస్తున్నప్పుడు, ముఖ్యంగా అధికార పక్షం ఇబ్బందులు పెడుతున్న సమయంలో విపక్షం సంయమనం పాటించాలి. ఇలాంటి సమయాల్లో చర్యకు ప్రతి చర్య పనికిరాదు. ప్రస్తుత ఘర్షణ రాజకీయ వాతావరణంలో గత నేతలను ఆదర్శంగా తీసుకుంటే వీరికి కనువిప్పు కలగవచ్చు. ప్రజా ఉద్యమాలే జీవితంగా బతికిన ప్రజల మనిషి, కమ్యూనిస్టు పార్టీ ప్రమాణాలను ఊపిరిగా భావించిన ఆదర్శమూర్తులు నర్రా రాఘవరెడ్డి, పుచ్చలపల్లి సుందరయ్య, బోడేపూడి వెంకటేశ్వరరావు, గౌతులచ్చనలతో పాటు ముఖ్యమంత్రులుగా పనిచేసిన నందమూరి తారక రామారావు, జలగం వెంగళరావు, 1999 నుండి 2004 వరకు రాష్ట్ర ప్రతిపక్ష నేతగా, తర్వాత ముఖ్యమంత్రిగా వ్యవహరించిన వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి, సుదీర్ఘకాలం విపక్షంలో ఉన్న జైపాల్‌రెడ్డి, వెంకయ్యనాయుడు వంటి నాయకుల స్ఫూర్తిని కొనసాగించడంలో ప్రస్తుత తరం నాయకులు విఫలమవుతున్నారు. దాడికి ప్రతిదాడి చేస్తూ, విమర్శలకు ప్రతివిమర్శలు చేస్తూ రాజకీయాలను దిగజారుస్తున్నారు. ఇలాంటి సంక్షోభ సమయంలో పవన్ కల్యాణ్ రాజకీయ పరిపక్వత చూపుతూ ఒక టార్చ్ బేరర్‌లా వ్యవహరిస్తున్నారనటంలో ఎలాంటి సందేహం లేదు!

# సీఎం ఛాంబర్ కు బాహుబలి డిజైన్

**నిర్మాణంలో 7 వేల టన్నుల ఉక్కు**

**35 వేల టన్నుల సిమెంటు**

**26 వేల టన్నుల ఇసుక**

**60 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీటు**

**11 లక్షల ఇటుకలు**

**3 లక్షల చదరపు అడుగుల గ్రానైట్,**

**లక్ష చదరపు అడుగుల మార్బుల్,**

**3,500 ఘనపు మీటర్ల ధోల్ పూర్ రెడ్ స్టోన్,**

**7,500 ఘనపుటడుగుల కలప**

**12 వేల మంది కార్మికులు మూడు షిఫ్టుల్లో పని**



**హైదరాబాద్ :**

28 ఎకరాల సువిశాల ప్రాంగణం.. 10.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునికంగా రూపుదిద్దుకున్న పరిపాలనా భవనం.. తెలంగాణ సహా విభిన్న సంస్కృతులకు అద్దం పట్టే నిర్మాణ శైలుల్లో రూపుదిద్దుకున్న కట్టడం! తెలంగాణ నూతన సచివాలయం.. వందేళ్ల విజన్ కు నిలువెత్తు నిదర్శనం అంటున్నాయి ప్రభుత్వ వర్గాలు! హుస్సేన్ సాగర్ తీరాన నిర్మించిన తెలంగాణ కొత్త సచివాలయానికి ఎన్నో ప్రత్యేకతలు. 28 ఎకరాల సువిశాల ప్రాంగణంలో కొత్త పరిపాలనా సౌధం కొలువుదీరింది. 10.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునికంగా రూపుదిద్దుకున్న భవనం ఇది. తెలంగాణ సహా విభిన్న సంస్కృతులకు అద్దం పట్టే నిర్మాణ శైలిలో తీర్చిదిద్దారు. ఆరు అంతస్తులుగా నిర్మితమైన ఈ భవనంలో ఎన్నో ప్రత్యేకతలు! ప్రవేశ ద్వారాలు మొదలుకొని.. ముఖ్యమంత్రి కొలువుదీరే ఆరో అంతస్తు వరకు అడుగడుగునా ఆధునిక సౌకర్యాలు, అంతర్గత సౌందర్యాలు! అన్నింటిట కలబోతగా దీన్ని నిర్మించారు. భవనం ఎత్తు 265 అడుగులు. 650 మంది సిబ్బందితో సచివాలయానికి నిరంతరం పహారా కాస్తుంటారు. నీటి సరఫరా, వాననీటి సంరక్షణ.. ఇలా పలు అంశాల్లో నూతన ప్రాంగణంలో దేనికదే ప్రత్యేకం. సచివాలయ భవనం ఎంత చూడముచ్చటగా కనిపిస్తోందో అంతకు దీటుగా మహాద్వారం చూపరులను ఆకట్టుకునేలా రూపొందించారు. 29 అడుగుల వెడల్పు, 24 అడుగుల ఎత్తుంటుంది. ఈ దర్వాజకు నాలుగు తలుపులుంటాయి. ఆదిలాబాద్ అడవుల్లోని నాణ్యమైన టేకు కలపను సేకరించి, దాన్ని నాగపూర్ పంపి అక్కడ మహాద్వారాన్ని తయారు చేయించారు. కలపపై ఇత్తడి పోతతో నగిషీలు చెక్కించారు. మొత్తం సచివాలయానికి 875కి పైగా తలుపులున్నాయి. అన్నింటినీ టేకుతోనే తయారు చేశారు. సీఎం ఛాంబర్ తలుపుకు బాహుబలి డిజైన్ చెక్కారు. గాండ్రిస్తున్న సింహం నోట్లో కొక్కెం ఉండేలా ఇత్తడి పోత పోశారు. దాని చుట్టూ పూల డిజైన్లతో మహా గంభీరంగా ఉంది ద్వారం. ఇకపోతే, సచివాలయం నిర్మాణంలో 7 వేల టన్నుల ఉక్కు వాడారు. 35 వేల టన్నుల సిమెంటు అవసరమైంది. 26 వేల టన్నుల ఇసుక కలిపారు. 60 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీటు వినియోగించారు. 11 లక్షల ఇటుకలు సచివాలయం భవనం కోసం వాడారు. 3 లక్షల చదరపు అడుగుల గ్రానైట్, లక్ష చదరపు అడుగుల మార్బుల్, 3,500 ఘనపు మీటర్ల ధోల్ పూర్ రెడ్ స్టోన్, 7,500 ఘనపుటడుగుల కలపను వినియోగించారు. 12 వేల మంది కార్మికులు మూడు షిఫ్టుల్లో పనిచేయడం వల్లే ఈ మహాద్భుతం కళ్లముందు ఆవిష్కృతమైంది. సచివాలయంలోకి ప్రవేశించగానే తెలంగాణ సంస్కృతిని చాటి చెప్పే కళాకృతులు, పెయింటింగ్స్ అమర్చాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన చేర్యాల పెయింటింగ్స్‌ను ఏర్పాటు చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. కొన్ని నమూనాలను ఇప్పటికే పరిశీలిస్తున్నారు. 34 గుమ్మటాలు, జాతీయ చిహ్నాలు కొత్త సచివాలయానికి మణిమయ మకుటాల్లా నిలిచాయి. కింది నుంచి ఎలాంటి ఆధారాలు లేకుండా నిర్మించిన డోమ్స్.. ఆధునిక ఇంజినీరింగ్ కౌశలానికి నిదర్శనం. 165 అడుగుల ఎత్తున ప్రధాన డోమ్ నిర్మించటం నిర్మాణ రంగంలోనే అతిపెద్ద సవాల్ అని నిపుణులు అంటున్నారు. సచివాలయానికి ముందు, వెనుక చెరొక ప్రధాన గుమ్మటాన్ని నిలబెట్టారు. ఈ రెండింటిపైనా జాతీయ చిహ్నమైన మూడు సింహాల విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఒక్కోటి అయిదు అడుగుల ఎత్తు ఉంటుంది. 2.5 టన్నుల బరువుండే ఈ సింహాల బొమ్మలను ఢిల్లీలో చేయించి తీసుకువచ్చి అమర్చారు. మరో 32 మూడు సింహాల చిహ్నాలు చిన్న డోమ్స్ భవనంపై కనిపిస్తాయి.

## ఆరో అంతస్తుకు.. టైట్ సెక్యూరిటీ

సీఎం కేసీఆర్ లక్కీ నెంబర్ ఆరు. అది అందరికీ తెలిసిన విషయమే! అందుకే ఆరో అంతస్తులో ముఖ్యమంత్రి ఛాంబర్ పెట్టారు. లోపల జనహిత పేరిట కట్టిన హాల్ ప్రజాదర్బారు కోసం పెట్టారు. ఆరో అంతస్తులోనే కేబినెట్ భేటీ జరుగుతుంది. 25 మంది మంత్రులు, 30 మందికి పైగా అధికారులు కూర్చునేందుకు వీలుగా కేబినెట్ హాలును రూపొందిచారు. ముఖ్యమైన, విశిష్ట అతిథులతో కలిసి సీఎం భోజనం చేసేందుకు ఒక అత్యాధునిక డైనింగ్ హాల్ ఏర్పాటు చేశారు. అందులో ఒకేసారి 25 మంది కూర్చుని తినొచ్చు. ఆరో అంతస్తులో లక్ష చదరపు అడుగు విస్తీర్ణంలో ముఖ్యమంత్రి కార్యాలయం ఏర్పాటైంది. పూర్తిగా తెల్లటి మార్బుల్ పరిచిన ఆ ప్రాంతం చూపరులను ముగ్ధులను చేస్తుంది. ముఖ్యమంత్రి కార్యాలయం కారిడార్‌ను ప్రత్యేకమైన మార్బుల్స్‌తో సుందరీకరించారు. తెలంగాణ సాంస్కృతిక సంపద ప్రతిబింబించేలా సీఎం చాంబర్ తలుపులు ఉంటాయి. సీఎం గది తలుపులపై సింహం ప్రతిమతో బహుబలి డిజైన్ తీర్చిదిద్దారు. వివిధ అంశాలపై అన్ని శాఖల ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించేందుకు సీఎం కాన్ఫరెన్స్ హాలు అత్యాధునిక వసతులతో నిర్మించారు. సీఎం కార్యాలయం, ఆయన సిబ్బందికి ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి ప్రజలను కలిసేందుకు, ప్రజాదర్బారు నిర్వహించేందుకు జనహిత పేరిట కనీసం 250 మంది కూర్చునేలా ఒక హాలును ఏర్పాటు చేశారు. 25 మంది మంత్రులు, 30 మందికి పైగా అధికారులు కూర్చునేందుకు వీలుగా కేబినెట్ హాలును సిద్ధం చేశారు. కలెక్టర్లతో సమావేశాల నిర్వహణ కోసం 60 మంది కూర్చునేలా ఒక హాలు, 50 మంది సమావేశమయ్యేందుకు మరో హాలును నిర్మించారు. ఈ నాలుగు మందిరాలతో పాటు సీఎం విశిష్ట అతిథులతో కలిసి భోజనం చేసేందుకు.. సుమారు 25 మంది ఆసీనులయ్యేలా అత్యాధునిక డైనింగ్ హాలును ఏర్పాటు చేశారు. కొత్త సచివాలయంలో వెహికిల్ పార్కింగ్ సదుపాయం కూడా భారీ స్థాయిలో సిద్ధమవుతోంది. ప్రాంగణంలో కేవలం సీఎం, మంత్రులు, అధికారులు, సిబ్బందికి మాత్రమే పార్కింగ్ సదుపాయం ఉంటుంది. సుమారు 2.5 ఎకరాల్లో అధికారులు, సిబ్బందికి చెందిన 560 కార్లు, 720 ద్విచక్ర వాహనాలు, నాలుగు బస్సులు ఏకకాలంలో పార్కింగ్ చేసేందుకు అవకాశం ఉంది. కనీసం 300 కార్లు పట్టే 1.5 ఎకరాల ప్రాంతాన్ని సందర్శకులకు కేటాయించారు. సాధారణ రోజుల్లో రోజుకు 700 నుంచి 800 మంది, అసెంబ్లీ సమావేశాల సమయంలో 1,000 మంది వరకు సచివాలయానికి వస్తారని అంచనా. ఆ మేరకు పార్కింగ్ సదుపాయాన్ని కల్పించారు. సచివాలయ భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చింది. అత్యాధునిక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశారు. చీమ చిటుక్కుమన్నా కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి అన్ని విభాగాల భద్రాతాధికారులకు చేరిపోతుంది. సందర్శకుల వివరాలన్నీ భద్రతాధికారుల కంప్యూటర్ తెరపై క్షణాల్లో ప్రత్యక్షమవుతాయి. ఆ భద్రతా వలయాన్ని దాటిన తరువాతే ఎవరైనా సచివాలయంలోనికి ప్రవేశించగలరు. అంటే లోపలికి వెళ్లడం అంత ఆషామాషీ కాదు. నిత్యం సుమారు 650 మందికిపైగా భద్రతా సిబ్బంది పహారా కాస్తారు. రాత్రీపగలూ నిరంతరాయంగా పనిచేసే పటిష్ఠమైన సీసీటీవీల కెమెరా వ్యవస్థను ఏర్పాటు చేశారు. సందర్శకుల ఫేస్ రికగ్నిషన్ ద్వారా వారి సమాచారం అప్పటికప్పుడు ఆధార్ డేటాతో అనుసంధానమవుతుంది. పోలీసు కమాండ్ కంట్రోల్ కేంద్రంలో నిక్షిప్తమై ఉండే డేటా ద్వారా సందర్శకుని పూర్తి వివరాలు వెంటనే కంప్యూటర్ తెరపై కనిపిస్తాయి. దాంతో వచ్చిన మనిషి నేర చరిత్రను వెంటనే పసిగట్టి, అభ్యంతరం ఉంటే విజిట్ నిలిపివేస్తారు.

# కమల్ ముసలే 'మదర్ థెరిసా & మీ' సినిమా ఫస్ట్ లుక్

కమల్ ముసలే తెరకెక్కించిన 'మదర్ థెరిసా & మీ' సినిమా ఫస్ట్ లుక్ విడుదలై... సోషల్ మీడియాలో విపరీతమైన సంచలనం సృష్టించింది

"మదర్ థెరిసా & మీ" అనే శక్తిమంతమైన ఈ కథ, ఆశ, కరుణ, ప్రేమలతో సమ్మిళితమైన ముగ్గురు అసాధారణ మహిళల జీవితం. 'మదర్ థెరిసా ఢ మీ' సినిమా నుంచి మేకర్స్ ఫస్ట్ లుక్ ను విడుదల చేసారు. ఈ చిత్రం పోస్టర్‌ను విడుదలైన అతి తక్కువ సమయంలో సోషల్ మీడియాలో సంచలనంగా మారి, సినిమా ప్రేమికులు ఈ పోస్టర్ విపరీతంగా ఆకర్షిస్తుంది.

ముఖ్యంగా ఈ చిత్రం భారత దేశంలో పేదలు, రోగులు అలాగే అనారోగ్యంతో మరణానికి దగ్గర అయిన వారికి మదర్ థెరిసా 1940 మధ్యకాలంలో అందించిన సేవల నేపథ్యంలో తెరకెక్కించబడింది. ఆ సమయంలో మదర్ థెరిసా ఏ విధంగా సాయపడింది. ఆ సమయంలో మదర్ థెరిసా ఎలాంటి సవాళ్లను ఎదుర్కొంది. వీటితో పాటు మదర్ తెరిసా గురించి కొన్ని ప్రధాన ప్రశ్నలను, అలాగే భారత సంతతికి తెలిసిన బ్రిటిష్ మహిళ కవిత కథను కూడ ఈ చిత్రంలో ఆవిష్కరించారు. ఈ చిత్రం మొదట ఇంగ్లీష్, హిందీలో విడుదలై తరువాత స్పానిష్ లో డబ్ చేస్తున్నట్లు తెలుస్తుంది. "కర్రీ వెస్ట్రన్" మరియు "మిలియన్స్ కెన్ వాక్" వంటి చిత్రాలకు ప్రసిద్ధి చెందిన డైరెక్టర్ కమల్ ముసలే ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ సినిమాను తెరకెక్కించారు.

ఈ సినిమాలో ముఖ్య తారాగణం బనితా సంధు. ఈమె పంజాబీ సంతతికి చెందిన బ్రిటిష్ నటి, తన 11 సంవత్సరాల వయస్సులోనే నటించడం ప్రారంభించింది. 2018 అక్టోబర్ లో షూజిత్ సిర్కార్ ఆనే సినిమా ద్వారా తెరంగేట్రం చేసి విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఈ సినిమా తర్వాత బనితా సంధు విశ్వవిద్యాలయంలో తన డిగ్రీని పూర్తి చేసింది. ఇక తన పాత్ర 'కవిత' గురించి బనితా సంధు మాట్లాడుతూ... " నిజ జీవితంలో కవితా పాత్రకు నాకు చాలా దగ్గరి పోలికలు ఉన్నాయని, కవిత తనలో తాను వెతుక్కునే అమ్మాయి. తన జీవితంలో తన చుట్టు ఉన్నవారితో సంబంధాలను, అలాగే తనకు తానే సంబంధాన్ని వెతుక్కుంటూ.. ఆమెలో ఆమెను గుర్తించే ఓ చిన్న అమ్మాయి. అయితే ఈ విషయంలో మాత్రం నేను కాస్త భిన్నం. కవిత పాత్రలో ఈ విషయమే నన్ను ఆకర్షించింది. తాను చాలా ఉద్రేకపరురాలు, ఈ విషయంలో నాకు చాలా తనకు చాలా వ్యత్యాసం ఉండటంతో తనలా ప్రవర్తించడానికి చాలా కష్టం అనిపించింది. మేము రిహార్సల్స్‌లో కూడా చాలా కష్టపడ్డాము." అని చెప్పింది.

మదర్ థెరిసా పాత్రలో జీవించిన నటి జాక్వెలిన్ ఫిట్షి-కోర్నాజ్ కు నటలో దాదాపు 30 సంవత్సరాల అనుభవం ఉంది. ఆ అనుభవంతో కమల్ ముసలే, రిచర్డ్ ఫ్రిట్‌షీ మరియు థియరీ కాగియానట్‌లతో కలిసి ఈ సినిమాను నిర్మించింది. ఈ చిత్రం క్రౌడ్ ఫండింగ్ ద్వారా విరాళాల ద్వారా తెలకెక్కించడం జరిగిందని విడుదల తర్వాత ఈ చిత్రానికి వచ్చే లాభాలను అనాధాశ్రమాలకు, ఆరోగ్యం విద్య వంటి సంక్షేమశాలలకు అందజేయబోతున్నట్లు తెలిపారు.

దీప్తి నావెల్ ఒక అమెరికన్ నటి ఆమె చాలా చిత్రాలలో హృదయాన్ని హత్తుకునే పాత్రలతో పాటు చాలా శక్తివంతమైన పాత్రలను పోషించింది.

ఆమె 1980లో ఏక్ బార్ ఫిర్ సినిమాతో రంగప్రవేశం చేసింది. ఈ సినిమాకు గాను ఆమె ఉత్తమ నటి అవార్డును గెలుచుకుంది. ఇప్పటివరకు 90 చిత్రాలకు పైగా నటించింది. అందులో అందరి ప్రశంసలు అందుకుని ఆస్కార్కు సైతం నామినేటెడ్ అయినా లయన్ చిత్రం ఉండటం విశేషం. దీప్తి ముఖ్యంగా ఆర్ట్ సినిమాలతో గుర్తింపు పొందింది. మదర్ తెరిసా గా ఈ సినిమాలో ఆమె నటించిన పాత్రకు, కనబరిచిన సున్నిత భావాలకు విమర్శకుల ప్రశంసలు అందుకుంది. భారత దేశంలోని మారుతున్న మహిళలకు ఈ పాత్ర అద్దం పడుతుంది.

కమల్ ముసలే ఈయన స్విస్-ఇండియన్ ఫిల్మ్ మేకర్, ఇప్పటివరకు 12 సినిమాలు నిర్మించారు. ఇంగ్లండ్‌లోని నేషనల్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ స్కూల్ నుండి ఫిల్మ్ డైరెక్షన్, స్క్రిప్ట్ రైటింగ్‌లో కోర్స్ చేశారు. ఫీచర్ ఫిలిమ్స్, డాక్యుమెంటరీలు, ఆర్ట్ మూవీస్‌తో సహా 30 చిత్రాలను తెరకెక్కించారు. ఆ చిత్రాలను కేన్స్ (ది త్రీ సోల్జర్స్) వంటి ప్రతిష్టాత్మక వేదికల్లో ప్రదర్శించారు. లోకర్నో (అలైన్, రాక్లెట్ కర్రీ) లాంటి అనేక అవార్డులను గెలుచుకున్నారు.

మదర్ థెరిసా ఢ మీ సినిమా కమల్ ముసలే రచనాదర్శకత్వంలో... కర్రీ వెస్ట్రన్ మూవీస్, లెస్ ఫిల్మ్స్ డు లోటస్‌ఢ కవితా థెరిసా ఫిల్మ్ బ్యానర్‌పై సంయుక్తంగా నిర్మించబడింది. ఈ సినిమాలో బనితా సంధు, జాక్వెలిన్ ఫ్రిట్షి-కోర్నాజ్, దీప్తి నావల్ ప్రధాన పాత్రల్లో నటించారు.

ఈ సినిమాలో విక్రమ్ కొచ్చర్, బ్రయాన్ లారెన్స్, హీర్ కౌర్, కెవిన్ మెయిన్స్, లీనా బైశ్యా, శోబు కపూర్, మహి అలీ ఖాన్, ఫెయిత్ నైట్, జాక్ గోర్డాన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రంలో ప్రధాన పాత్రలు అందరూ స్త్రీలే కావడం విశేషం.డీఓపీ గా కైకో నకహారా ది , రేఖ ముసలే ప్రొడక్షన్ డిజైనర్ గా పనిచేశారు. నుపూర్ కజ్బాజే బాటిన్ లైన్ ప్రొడ్యూసర్ గా... పీటర్ స్చెరర్ మ్యూజిక్ డైరెక్టర్ గా పనిచేశారు. అన్నిక్ రోడ్డీ, వాల్టర్ మెయిర్ ఢ లారెన్స్ క్రెవోసియర్ లు స్వరాలను అందించారు. సినీపోలిస్, ఖఇఔ మరుధర్ ఈ చిత్రాన్ని దేశవ్యాప్తంగా విడుదల చేయబోతున్నారు."మదర్ థెరిసా ఢ మీ" 5 మే 2023న ప్రేక్షకుల ముందుకు రానున్న సందర్భంగా ఈ మధ్యే ప్రసాద్ లాబ్స్ లో ఘనంగా ఫస్ట్ లుక్ వేడుకను చిత్ర యూనిట్ నిర్వహించారు.



# 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు' ఆడియో రైట్స్ ను సొంతం చేసుకున్న సోని మ్యూజిక్




ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ జీఏ2 పిక్చర్స్ బ్యానర్ పై తెరకెక్కుతోన్న సినిమా 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు'. సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ బన్నీ వాసు మరియు దర్శకుడు వెంకటేష్ మహా ఈ సినిమాను ప్రెజెంట్ చేస్తున్నారు. భలే భలే మగాడివోయ్, గీత గోవిందం, టాక్సీవాలా, ప్రతిరోజూ పండగే, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్ , 18 పేజెస్ లాంటి అద్భుతమైన చిత్రాల తర్వాత జీఏ 2 పిక్చర్స్ బ్యానర్లో వస్తున్న సినిమా "అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు".

షార్ట్ ఫిల్మ్స్ తో కెరియర్ మొదలు 'కలర్ ఫోటో' సినిమాతో సాలిడ్ హిట్ అందుకున్నాడు సుహాస్. కేవలం యూత్ కి నచ్చే కాన్సెప్ట్ బేస్డ్ సినిమాలు మాత్రమే కాకుండా, రీసెంట్ గా 'రైటర్ పద్మభూషణ్' వంటి సినిమా చేసి ఫ్యామిలీ ఆడియెన్స్ కూడా దగ్గరయ్యాడు సుహాస్. ప్రస్తుతం సుహాస్ హీరోగా చేస్తున్న 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు' మూవీ ఇప్పుడు షూటింగ్ పనులను ముగించుకుని ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతుంది.జీఏ2 పిక్చర్స్, ధీరజ్ మోగిలినేని ఎంటర్టైన్మెంట్స్ , వెంకటేశ్ మహా నిర్మాణంలో దుశ్యంత్ కటికనేని ని దర్శకుడిగా పరిచయం చేస్తూ, ధీరజ్ మొగిలినేని ఈ సినిమాను నిర్మించారు.మ్యారేజ్ బ్యాండ్ లో పనిచేసే మల్లి అనే కుర్రాడిగా సుహాస్ ఈ సినిమాలో నటిస్తున్నాడు. తాజాగా చిత్ర యూనిట్ ఫస్ట్ లుక్ పోస్టర్ ను రిలీజ్ చేశారు.రిలీజ్ చేసిన పోస్టర్ లో మల్లికార్జున సెలూన్ షాప్ ను చూపిస్తూ, సెలూన్ షాప్ ముందు 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు' మెంబర్స్ ను రివీల్ చేసారు. సుహాస్ తో పాటు గోపరాజు రమణ, పుష్ప ఫేమ్ జగదీశ్ డప్పులు, సన్నాయి తో పాటు పలురకమైన మంగళవాయిద్యాలతో ఈ పోస్టర్ లో కనిపించారు.ఈ సినిమా ఆడియో రైట్స్ ను సోని మ్యూజిక్ సంస్థ సొంతం చేసుకుంది.సినిమాకి సంబంధించిన మరిన్ని అప్డేట్స్ ను త్వరలో అధికారికంగా ప్రకటించనుంది చిత్ర బృందం.

# రామబాణం మంచి ఫ్యామిలీ ఎంటర్ టైనర్



'లక్ష్యం', 'లౌక్యం' వంటి బ్లాక్ బస్టర్స్ తర్వాత మాచో స్టార్ గోపీచంద్, డైరెక్టర్ శ్రీవాస్ కలయికలో వస్తున్న హ్యాట్రిక్ మూవీ 'రామబాణం'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని భారీస్థాయిలో నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. గోపీచంద్ సరసన డింపుల్ హయతి కథానాయికగా నటిస్తోంది. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ అద్భుతమైన రెస్పాన్స్ తో సినిమాపై అంచనాలు పెంచింది. మే 5న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తున్న నేపధ్యంలో చిత్ర యూనిట్ ప్రెస్ మీట్ నిర్వహించింది.

ప్రెస్ మీట్ లో హీరో గోపీచంద్ మాట్లాడుతూ.. ఈ సినిమా చేయడానికి ముందుకు వచ్చిన విశ్వప్రసాద్ గారికి, వివేక్ కూచిభొట్ల గారికి కృతజ్ఞతలు. ఎక్కడా రాజీ పడకుండా సినిమాకి కావాల్సిన ప్రతిది సమకూర్చి సినిమాని గ్రాండ్ గా నిర్మించారు. శ్రీవాస్ గారితో 'లక్ష్యం', 'లౌక్యం' చేశాను. మూడో సినిమా చేద్దామని అనుకున్నప్పుడు 'లక్ష్యం', 'లౌక్యం' లా ఫ్యామిలీ ఎంటర్ టైనర్ చేయాలని అనుకున్నాం. అప్పుడు భూపతి రాజా గారి దగ్గర వున్న కథ విన్నప్పుడు చాలా నచ్చింది. మధు, అబ్బూరి రవి గారు కూడా ఈ కథకు చాలా హెల్ప్ చేశారు. డింపుల్ చాలా చక్కగా నటించింది. తనకి మంచి భవిష్యత్ వుంటుంది. మిక్కీ జే మేయర్ తో చేయడం ఇదే మొదటిసారి. చాలా అద్భుతమైన పాటలు ఇచ్చారు. ఇప్పటికే పాటలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. మే 5న రామబాణం విడుదలౌతుంది. అందరూ థియేటర్ కి వెళ్లి చూడండి. మీ అందరికీ తప్పకుండా నచ్చుతుందనే నమ్మకం వుంది" అన్నారు.

దర్శకుడు శ్రీవాస్ మాట్లాడుతూ.. గోపీచంద్ గారు నేను సినిమా చేస్తున్నామని తెలిసినప్పటి నుంచి హ్యాట్రిక్ కాంబో అనే పాజిటివ్ వైబ్ అందరి నుంచి వచ్చింది. అది మాకు పాజిటివ్ ఎనర్జీ ఇచ్చింది. అలాగే 'లక్ష్యం', 'లౌక్యం' కు మించి సినిమా ఉండాలనే కాన్సియస్ ని కూడా ఇచ్చింది. స్క్రిప్ట్ వర్క్, హార్డ్ వర్క్, టీం వర్క్ అన్నీ కలిపి రామబాణం ఎక్స్ టార్డినరీగా వచ్చింది. ఈ సినిమా అవుట్ పుట్ చూశాక చాలా నమ్మకంగా అనిపిచింది. రామబాణంను ఇంత గ్రాండ్ స్కేల్ లో చేయడానికి పూర్తి సహకారం అందించిన పీపుల్ మీడియా ఫ్యాక్టరీ విశ్వప్రసాద్ గారికి, వివేక్ గారికి కృతజ్ఞతలు. డీవోపీ వెట్రి అద్భుతమైన విజువల్స్ ఇచ్చారు. గోపీచంద్ గారి ఫ్యాన్స్ కి కావాల్సిన యాక్షన్ ఎపిసోడ్స్ చాలా కొత్తగా వుంటాయి. ఆర్ట్ వర్క్ కూడా చాలా అద్భుతంగా కుదిరింది. అన్ని జాగ్రత్తలు తీసుకొని గ్రాండ్ గా చేశాం. చాలా ఎక్సయిటింగ్ ఎపిసోడ్స్ వున్నాయి. ఇంటర్వెల్, క్లైమాక్స్ హైలెట్ అవుతాయి. సెకండ్ హాఫ్ లో ఎమోషన్స్ సీన్స్ ఫ్యామిలీ ఆడియన్స్ గొప్పగా కనెక్ట్ అవుతాయి. మిక్కీ జే మేయర్ మ్యూజిక్ ఆల్రెడీ విజయం సాధించింది. నేపధ్య సంగీతం కూడా హైలెట్ గా వుంటుంది. ప్రవీణ్ పూడి క్రిస్ప్ గా ఎడిట్ చేశారు. మధు మంచి డైలాగ్స్ రాశారు. భూపతి రాజా గారు అద్భుతమైన కథ ఇచ్చారు. డింపుల్ పాత్ర చాలా కీలకం. చాలా బ్యూటీఫుల్ గా చేసింది. కుష్బూ గారు, గోపీచంద్ గారి మధ్య వచ్చే ఎమోషన్స్ సీన్స్ కట్టిపడేస్తాయి. అలాగే జగపతి బాబు గారి పాత్ర కూడా ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. ఈ చిత్రానికి పని చేసిన అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు. ఎంటర్ టైన్ మెంట్, సెంటిమెంట్, ఎమోషన్స్ అన్నీ అద్భుతంగా కుదిరిన సినిమా రామబాణం. మే 5న ఫ్యామిలీ తో కలసి థియేటర్ లో సరదాగా ఎంజాయ్ చేసి రావచ్చు . ఈ సమ్మర్ కి మంచి ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా రామబాణం అలరిస్తుంది" అన్నారు

డింపుల్ హయతి మాట్లాడుతూ.. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మాణంలో, గోపీచంద్ గారు, శ్రీవాస్ గారి హ్యాట్రిక్ మూవీ రామబాణంలో భాగమైనందుకు అదృష్టంగా భావిస్తున్నాను. ఇందులో భైరవి అనే పాత్రలో కనిపిస్తాను. ఆ పాత్ర మీ అందరినకీ నచ్చుతుందని నమ్ముతున్నాను. మే 5న అందరూ సినిమా చూడాలి" అని కోరారు.

వివేక్ కూచిభొట్ల మాట్లాడుతూ.. ఈ వేసవిలో ప్రతి ఫ్యామిలీ చూడదగ్గ సినిమా. గోపీచంద్ గారి యాక్షన్ ని ఇష్టపడే ప్రేక్షకులకు కూడా రామబాణం ఒక పండగలా వుంటుంది. గోపీచంద్ గారికి, శ్రీవాస్ గారికి కృతజ్ఞతలు. మిక్కీ జే మేయర్ గారు చాలా మంచి మ్యూజిక్ ఇచ్చారు. టీం అందరికీ కృతజ్ఞతలు. రామబాణం ఖచ్చితంగా మంచి విజయం సాధిస్తుంది" అన్నారు.

మధు మాట్లాడుతూ.. ఓ కొత్త కాన్ఫ్లిక్ట్ తో వచ్చిన అన్నదమ్ముల కథ రామబాణం. ఈ సినిమాలో అన్నీ ఎలిమెంట్స్ అద్భుతంగా కుదిరాయి. ప్రేక్షకులు ఖచ్చితంగా ఎంజాయ్ చేస్తారు. మే 5న అందరూ థియేటర్ లో ఎంజాయ్ చేయండి" అన్నారు.

Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950